ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 26.0


జూమ్ కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అంగన్‌వాడీ పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించాలి : కలెక్టర్

ఏలూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి):జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల నిండిన పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేసేందుకు సీడీపీవోలు, ఎంఈవోలు సమన్వయంతో చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. పాఠశాలలు హెచ్ఎం, ఐసీడీఎస్, విద్యాశాఖాధికారులతో ఆమె శుక్రవారం జీరో ఎన్‌రోల్‌మెంట్‌పై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసలు పిల్లలు నమోదు లేని పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఐదేళ్ల నిండిన పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శారద, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎంఈవోలు, సీడీపీవోలు పాల్గొన్నారు.


ఆర్టీసీ డిపోను పరిశీలిస్తున్న పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి

ఆర్టీసీ బస్టాండ్ల ఆధునికీకరణ

» జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ షబ్నం

నూజివీడు టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్టాండ్లను ఆధునికీకరణ, పునరుద్ధరణ కోసం ప్రణాళికలను ప్రభుత్వానికి పంపుతున్నట్టు జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ షబ్నం తెలిపారు. నూజివీడు ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇందులో భాగంగా తాగునీరు మరుగుదొడ్లు, డ్రెయినేజీ వ్యవస్థల అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ఈసందర్భంగా గ్యారేజ్ బస్టాండర్లను ఆమె క్షుణ్ణంగా పరిశీలించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీకి 106 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఉదయం షిఫ్టులో జరిగిన పరీక్షకు 304 మంది అభ్యర్థులకు 247మంది, మధ్యాహ్నం షిఫ్టులో 305మందికి 256మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. మొత్తంమీద 106 మంది గైర్హాజరయ్యారు.

ప్రజా సమస్యలపై పోరాటం

» పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలి

» కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ఏలూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి):'కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పోరాటాలు చేయండి. పార్టీ శ్రేణులు ఐక్యంగా ఉంటూ ముందుకు కదలండి' అంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు అధ్యక్షతన శుక్రవారం ఏలూరులో జరిగింది. షర్మిల మూడు గంటలపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కో-ఆర్డినేటర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి ఏం చేయాలో చెప్పాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మండలాలు, గ్రామాల్లో కమిటీలను నియమిస్తే పార్టీ పటిష్ఠం అవుతుందని చెప్పారు. దెందులూరు నియోజకవర్గంలో గత ఎన్నికలప్పుడు వైసీపీ నేతలు దౌర్జన్యం చేసి రెండుసార్లు దాడులు చేశారని, దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నామని కో-ఆర్డినేటర్ ఆలపాటి నర్సింహమూర్తి షర్మిలకు వివరించారు.




కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరారు. ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్ర మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని భర్తీ చేస్తే యువత ను మరింతగా పార్టీ వైపు ఆకర్షించవచ్చ న్నారు. మీరు పాదయాత్రలు చేస్తే పార్టీకి మరింత ఊపు వస్తుందని పలువురు నేతలు కోరారు. దీనిపై స్పందించిన షర్మిల 'ప్రజా సమస్యలపై నియోజకవర్గాల్లో ఐక్యంగా కలిసి పోరాటాలు చేస్తేనే ప్రజలు పార్టీ వైపు ఆకర్షి తులవుతారు. ఆపై ఏదైనా యాత్రలు చేస్తే సక్సెస్ అవుతాయని అభిప్రాయపడ్డారు. ఎవరో నాయకులు వస్తారని ఎదురుచూడ కుండా మండల, గ్రామ కమిటీలను ఉన్న వారితో నియమించండి' అని ఆదేశించారు. నియోజక వర్గ కన్వీనర్లు ఉన్నమట్ల ఎలీజా, పెద్దిరెడ్డి సుబ్బారావు, బండి విజయభాస్కర్, బొడ్డు నోబుల్, మరీదు కృష్ణ, కిసాన్‌సెల్ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకరరావు, లంకా వెంకట రామ్మోహన్‌రావు, ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

మంచిరోజులొచ్చాయ్!

అంగన్‌వాడీ కేంద్రాలకు దశలవారీగా మహర్దశను కల్పించేలా తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుంటోంది. ఇటీవలే టీచర్ల, ఆయాలకు గ్రాడ్యూటీ మొత్తాలను పెంపునకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా,ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగుల ప్రధాన డిమాండ్‌ను నెరవేర్చేందుకు తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల హోదా కల్పించేందుకు ఇటీవల మంత్రి వర్గ ఉపసంఘం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు జిల్లాలో 266 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా మారనున్నాయి. దీనిపై తుది ఉత్తర్వులు ఈ వారంలోనే వెలువడే అవకాశాలున్నాయి.

(ఏలూరు/ముదినేపల్లి,ఆంధ్రజ్యోతి)

ప్రధాన కేంద్రాలుగా మినీ అంగన్‌వాడీల మార్పు

» జిల్లాలో 266 కేంద్రాలకు అప్‌గ్రేడేషన్ హోదా

» కేంద్రాల్లో పెరగనున్న సిబ్బంది

పల్లె,పట్టణం అనే తేడా లేకుండా ప్రతీ గ్రామంలో స్కూల్ పరిసరాలకు దగ్గరలోనే మినీ అంగన్‌వాడీ కేంద్రాలను తెలుగుదేశం ప్రభుత్వంలో విస్తరించారు. తక్కువ జనాభా ఉన్న అంటే 250 నుంచి 400లోపు ఉండే గ్రామాల్లో మినీ అంగన్‌వాడీ కేంద్రాలుగా ఉండాలని నిర్దేశించారు.గ్రామ శివారు లేదా ఏజెన్సీ ప్రాంతాల్లో అప్పట్లో మిని అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజల సౌలభ్యం కోసం ఏర్పాటు చేశారు. చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు బడిలో చేరేందుకు వీలుగా ఓనమాలు దిద్దే కేంద్రాలుగా అంగన్‌వాడీలు ఖ్యాతిగాంచాయి. జిల్లాలో 266 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు దాదాపుగా 15 ఏళ్ల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. అయితే గ్రామాల్లో జనాభా విస్తరించడంతో పిల్లల సంఖ్య పెరిగింది. ఇప్పుడు ఉన్న భవనాలు చాలక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క సెంటర్‌లో 20 నుంచి 40 వరకు ఉండే చిన్నారులను హెల్పర్ లేదా టీచర్ ఒక్కరే సాకుతూ ఉండేవారు. వీరికి రూ.7వేల వేతనం లభించేది. జిల్లాలో 266 మినీ అంగన్‌వాడీ (మిగతా 8వ పేజీలో)

నియోజకవర్గాల వారీగా మారే మినీ కేంద్రాల సంఖ్య

ఉంగుటూరులో 4, భీమడోలు 1, నిడమర్రు 4, బుట్టాయగూడెం 41, జీలుగుమిల్లి 10, టి.నర్సాపురం 9, చింతలపూడి 17, లింగపాలెం 7, ఏలూరు అర్బన్ 9, ఏలూరు రూరల్ 1, కామవరపుకోట 8, జంగారెడ్డిగూడెం 6, ద్వారకా తిరుమల 7, కైకలూరు 1, కలిదిండి 5, మండవల్లి 1, ముదినేపల్లి 8, కొయ్యలగూడెం 18, పోలవరం 19, కుక్కునూరు 31, వేలేరుపాడు 17, నూజివీడు 7, ఆగిరిపల్లి 1, ముసునూరు 2, చాట్రాయి 7, పెదపాడు 5, దెందులూరు 9 మినీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలు రూపాంతరం చెందనున్నాయి.



కిల్లర్ సింహాద్రికి జీవిత ఖైదు

» ప్రసాదంలో సైనేడ్ కలిపి 20 నెలల్లో పది హత్యలు



» 2019.. వడ్లమానులో వ్యక్తి హత్య.. నేరం నిరూపణ కావడంతో శిక్ష విధిస్తూ విజయవాడ కోర్టు తీర్పు

చేపల వేటకు వెళ్లి ముగ్గురి మృతి

» నీటిగుండం లో మునిగిన ఇద్దరు అన్నదమ్ములు సహా మరొకరు

» ఒకరిని కాపాడే ప్రయత్నంలో మరో ఇద్దరు మృత్యువాత

■ లోపలి పేజీలో..

సంస్థాగత ఫైట్ !


కార్యకర్తల మధ్య తోపులాట

» టి.నరసాపురం మండల టీడీపీలో ఇరువర్గాల అధిపత్యపోరు

» ఉద్రిక్తతల నడుమ సంస్థాగత ఎన్నికల అభిప్రాయాల సేకరణ

టి.నర్సాపురం, జూన్27(ఆంధ్రజ్యోతి): టి.నర సాపురం మండలంలో టీడీపీ సంస్థాగత ఎన్ని కల కమిటీ నిర్వహించిన కార్యకర్తల అభి ప్రా య సేకరణలో వర్గ విభేదాలు మరోసారి బహి ర్గతం అయ్యాయి. కొంత కాలంగా నాయకుల మధ్య వర్గపోరు సాగుతోంది. ఇటీవల గ్రామ కమిటీల ఎంపిక విషయంలోను ఆధిపత్యం కోసం ఇరు వర్గాల నాయకులు పోటీపడ్డారు. గ్రామ కమిటీల ఎంపికకు జిల్లా, రాష్ట్ర నాయకత్వం పరిశీలకులను నియమించింది. ఈ మేరకు పోలవరం నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, వెంకటనారాయణ, మండల పరిశీలకుడు గుత్తా వెంకటేశ్వరరావు, నియోజక వర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్ఎస్ కల్యాణ మండపంలో కమిటీల ఎంపికకు కార్యకర్తల అభిప్రాయాల సేకరణ చేపట్టారు. మండలంలోని 15 పంచాయతీల నుంచి టీడీపీ కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకున్నారు. పరిశీలకులు ఒక్కో పంచాయతీ నుంచి కార్యకర్తలను పిలిచి అభిప్రాయాలు సేకరిస్తున్న క్రమంలో కార్యకర్తల మధ్య వాదోపవాదాలతోపాటు కొద్దిసేపు తోపులాట జరగగా ఉద్రిక్తత (మిగతా 8వ పేజీలో)


అభిప్రాయ సేకరణ చేస్తున్న పరిశీలకులు అంగర, బొరగం

పాఠశాల కొనసాగేలా చూస్తాం : డీఈవో



కైకలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హాజరును బట్టి పాఠశాల కొనసాగేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. కైకలూరు వెలమపేట కాలనీలోని ఎంపీ యూపీ స్కూల్‌ను ఉన్నత పాఠశాలకు తరలించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమక్షంలో విచారణ చేపట్టారు. పాఠశాలలో 80 మంది విద్యార్థులుండగా 6,7,8 తర గతుల విద్యార్థులు 60మందికి పైగా ఉన్నారని, వీరిని సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తరలించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 8వ తరగతి వరకు వెలమపేట ఎంపీయూపీ స్కూల్లో తరగతులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. డీఈవో మాట్లాడుతూ పిల్లలు ఉన్నచోటే పాఠశాల నిర్వహించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేస్తామన్నారు. సమగ్రశిక్ష ఏపీఏ కమతం పంకజ్‌కుమార్, ఎంఈవో రామారావు, ఎంపీటీసీ శశికళ, వార్డు సభ్యుడు శ్రీనివాసు, టీడీపీ నాయకుడు బంకపల్లి భాస్కరరావు పాల్గొన్నారు.



మాబడి మాకు కావాలి

» కోడూరు యూపీ స్కూలు విద్యార్థుల ధర్నా

ముదినేపల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోడూరు యూపీ పాఠశాల స్థాయి తగ్గించి బేసిక్ ప్రైమరీ పాఠశాలగా మార్పు చేయడాన్ని నిరసిస్తూ పాఠశాల విద్యార్థులు గ్రామంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. మా స్కూలు మాకే కావాలి అంటూ పలకలపై రాసి మేము హైస్కూల్ చదువులకు వేరే పాఠశాలకు వెళ్లేది లేదని నినాదాలు చేశారు. 6,7,8 తరగతులు చదివేందుకు సుమారు తొమ్మిది కిలోమీటర్ల దూరంలోని పెదపాలపర్రు హైస్కూలుకు లేదా ముదినేపల్లి హైస్కూలుకు ఎలా వెళ్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. యూపీ స్కూలును యథాతథంగా కొనసాగించే వరకు ఆందోళన కొనసాగిస్తామని ప్రకటించారు.




బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీవో అనూరాధ.. హాజరైన సచివాలయాల ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

ఏలూరుసిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. జిల్లాలో ప్రస్తుతం గ్రామ/వార్డు సచివాలయాల్లోని గ్రేడ్-5, గ్రేడ్-6 సచివాలయ కార్యదర్శులకు సంబంధించి తొలిరోజు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలో గ్రేడ్- 5 కార్యదర్శులు 88 మంది, గ్రేడ్-6 (డిజిటల్ అసిస్టెంట్లు) 304 మంది కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉండగా గ్రేడ్-5కు సంబంధించి 79 మంది, గ్రేడ్-6కు సంబంధించి 225 మంది హాజరయ్యారు. ఏలూరు జడ్పీ కార్యాలయంలో డీపీవో కొడాలి అనూరాధ నేతృత్వంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. సంబంధిత ఉద్యోగులు తాము ఎక్కడకు బదిలీ కోరుకుంటున్నారో ఆప్షన్ ఇచ్చారు. కాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు జిల్లాకు బదిలీలు కోరుకునే ఉమ్మడి పశ్చిమగోదావరి సచివాలయాలకు చెందిన ఉద్యోగులూ కౌన్సెలింగ్‌లో పాల్గొని సంబంధిత ఫారాలలో ఆప్షన్ ఇచ్చారు. అయితే తాము కోరుకున్న ప్రాంతాలకు బదిలీలు జరుగుతాయో.. లేదో అన్న విషయం తెలియడం లేదని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. గ్రామ/వార్డు సచివాలయాలకు సంబంధించి మిగిలిన శాఖలకు సంబంధించిన ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను ఈనెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, మహిళా కానిస్టేబుల్, వెల్ఫేర్ అసిస్టెంట్ బదిలీలు జరగాల్సి ఉంది. శనివారం వ్యవసాయ శాఖ అసిస్టెంట్లకు బదిలీల ప్రక్రియ నిర్వహిస్తారని తెలుస్తోంది.ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా సీనియార్టీ మేరకు ఐదేళ్ల దాటిన వారిని వారు పనిచేసే మండలం కాకుండా ఇతర ప్రాంతాలకు బదిలీలు చేయాల్సి ఉంది. ఉద్యోగులు ఆ విధంగా తమ ఆప్షన్లలో ఇతర ప్రాంతాలకు బదిలీలు కోరుకుంటున్నారు. ఈక్రమంలో సచివాలయ ఉద్యోగులు ప్రజా ప్రతినిధులతో సిఫార్సు చేయించుకుంటున్నట్టు తెలుస్తోంది. పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. కాగా సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో జడ్పీ కార్యాలయం సచివాలయ ఉద్యోగులతో సందడిగా కన్పించింది.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి.గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా కైకలూరు మండలంలో 42.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 17 మి.మీగా నమోదైంది. మండవల్లి 36.2, జీలుగుమిల్లి 34.2, బుట్టాయిగూడెం 27.2, కలిదిండి 24.6, ఆగిరిపల్లి 24.2, టి.నరసాపురం 22, చింతలపూడి 21, కొయ్యలగూడెం 20.8, ముదినేపల్లి 17.4, ద్వారకాతిరుమల 16.2, జంగారెడ్డిగూడెం 14.6, పోలవరం 14.4, ఏలూరు రూరల్ 14.4, పెదవేగి 14.2, లింగపాలెం 14.2, కుక్కునూరు 14.2, కామవరపుకోట 13.4, పెదపాడు 13.4, ముసునూరు 13.2, నిడమర్రు 12.6, ఏలూరు అర్బన్ 12.6, దెందులూరు 7.8, వేలేరుపాడు 7.6, భీమడోలు 7, ఉంగు టూరు 6.6, నూజివీడు 4.8, చాట్రాయి 4.6 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. వర్షాల రాకతో సార్వా సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

డీఎంహెచ్‌వోగా డాక్టర్ జాన్ అమృతం


డాక్టర్ జాన్ అమృతం

» డాక్టర్ మాలిని ఆకస్మిక బదిలీ

ఏలూరు అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి):జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో)గా డాక్టర్ పి.జాన్ అమృతం బదిలీపై నియమితులయ్యారు. ప్రస్తుత డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినిని గుంటూరు నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (సీఎంహెచ్‌వో)గా బదిలీ చేయగా, అదేస్థానంలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ పీ.జే.అమృతంను జిల్లాకు నియమించారు. పరిపాలన అవసరాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరిగిన కొన్ని బదిలీల్లో వీరిద్దరివీ ఉన్నాయి. జిల్లాలో డీఎంహెచ్‌వోగా గతేడాది డిసెంబరు 24న బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మాలిని కేవలం ఆరునెలల వ్యవధిలోనే ఆకస్మికంగా బదిలీ కావడం గమనార్హం. ఇటీవలే జరిగిన వైద్యఉద్యోగుల సాధారణ బదిలీలు, ముఖ్యంగా సీనియర్ హెల్త్ అసిస్టెంట్ల (ఫిమేల్) బదిలీలు, గ్రేడ్-3 సచివాలయాల ఏఎన్ఎంలను వైద్యఆరోగ్యశాఖ పరిధిలోకి తెస్తూ వారికి ఎంపీహెచ్ఏ(ఫిమేల్)గా పదోన్నతులు ఇచ్చేవిషయాల్లో కాస్త గందరగోళ పరిస్థితులు తలెత్తినా డాక్టర్ మాలిని పారదర్శకంగా వ్యవహరించారు. కాగా 1997లో సివిల్ అసి స్టెంట్ సర్జన్‌గా ఉద్యోగప్రవేశం చేసిన డాక్టర్ జాన్ అమృతం దాదాపు ఉద్యోగకాలమంతా ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే కొనసాగింది. ఈ ఏడాది జనవరి నుంచి పదోన్నతిపై గుంటూరు నగరపాలక సంస్థకు సీఎంహెచ్‌వోగా బదిలీ కాగా అక్కడే ఇప్పటివరకు పనిచేస్తున్నారు.

త్వరలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో మరొకరికి స్థానచలనం?

పరిపాలనా సౌలభ్యంలో భాగంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో కీలకస్థానంలో పని చేస్తున్న ఒకరిని బాధ్యతల నుంచి తప్పించనున్నట్టు సమాచారం. ప్రస్తుతం కార్యాలయంలో కీలక విధులు నిర్వర్తిస్తున్న ఒక మెడికల్ ఆఫీసర్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్‌చేసి మరొకరికి అప్పగించనున్నట్టు తెలిసింది. పలు ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం, ఆఫీసు వ్యవహారాల్లో ఇతర సిబ్బందిపై ఆధారపడటం, అవగాహనా రాహిత్యం, తదితర అంశాలనే వెనుకబాటుకు ప్రామాణికంగా తీసుకుని ఆ కీలక బాధ్యతలను మరొకరికి అప్పగించడానికి యత్నాలు జరుగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.



తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌కు మహర్దశ

రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు

మూడో ఆర్‌వోబీ, రెండు అండర్‌పాస్‌ల నిర్మాణం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌కు కొత్త రూపు రానుంది. ఏళ్ల తరబడి పట్టణ, పరిసర ప్రాంతవాసులను వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యతో పాటు అత్యంత రద్దీగా ఉండే రైల్వే గేట్‌లకు అండర్ పాస్‌లకు రైల్వేశాఖ నిధులు కేటాయించింది..ఇప్పటికే రైల్వేస్టేషన్‌కు అమృత్ భారత్ పథకం కింద స్టేషన్‌లో పలు అభివృద్ధి పనులు శర వేగంగా సాగుతుండగా వాటికి తోడు మూడో ఫ్లైఓవర్, రెండు అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్ట నున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే గూడెం రైల్వేస్టేషన్ కొత్తరూపు సంతరించుకుంటుంది.

దశాబ్దాల చరిత్ర

తాడేపల్లిగూడెం రైల్వే అంటే వ్యాపార కూడలికి పెట్టింది పేరు. స్వాతంత్రోద్యమ కాలంలో కూడా తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్ సేవలందించింది. ఐదు దశాబ్ధాల క్రితం అప్పటి ఎమ్మెల్యే ఈలి ఆంజనేయులు హయాంలో పోలీస్ ఐలాండ్ వద్ద తొలిసారిగా మొదటి ఫ్లైవోవర్ నిర్మించారు. కడకట్ల యాగర్లపల్లి, పడాల ప్రాంతాలను కలుపుతూ 15 ఏళ్ల క్రితం ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ రెండో ఫ్లైఓవర్ నిర్మించారు. తరువాత అధికారంలోకి వచ్చిన నాయకులు మూడో ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రయత్నించినా అవి సాధ్యం కాలేదు. ఆ కల నేటికి అలానే మిగిలిపోయింది.

రూ.300 కోట్లతో అభివృద్ధి

తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అభివృద్ధి పనులకు రూ.300 కోట్లు విడుదల చేయించడంలో కీలకంగా వ్యవహరించారు. వాటిలో మూడో ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.110 కోట్లు, ఇతర పనులకు నిధులు మంజూరు చేశారు.రూ.110 కోట్లతో ఏలూరు కాలువ మీదుగా జువ్వలపాలెం కుంచనపల్లి ప్రాంతాలు కలుపుతూ వంతెన నిర్మాణం చేపట్టేందుకు ప్రణాలికలు సిద్ధం చేశారు. దీని కోసం ఇటీవల రైల్వే అధికారులు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఫ్లైఓవర్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. వాటితో పాటు తాడేపల్లిగూడెం మండలం నవా బుపాలెం వద్ద రూ.67 కోట్లతో ఒక ఆర్‌వోబీ, మారంపల్లి వద్ద రూ.63 కోట్లతో మరో ఆర్‌వోబీ నిర్మాణానికి నిధులు విడుదల చేశారు. ఇంకా వాటితో పాటు గూడ్స్ షెడ్, రైల్వే అభివృద్ధి పనులు చేయనున్నారు.

శరవేగంగా స్టేషన్ అభివృద్ధి

అమృత భారత్ పథకం ద్వారా తాడేపల్లిగూడెం రైల్వేస్టేషను అభివృద్ధికి ఇప్పటికే కేంద్రం రూ.24 కోట్లు నిధులు విడుదల చేయడంతో పాటు ఆయా పనులు శరవేగంగా సాగు తున్నాయి. 1,2,3 ప్లాట్‌ఫాంల అభివృద్ధి, ఎస్క లేటర్, మోడ్రన్ ఏసీ వెయిటింగ్ రూం, సీవోపీ, ఎలివేషన్ మార్పు తదితర పనులు చేపట్టారు.

కదిలిన జగన్నాథుని రథచక్రాలు

లక్ష్మీపురం ఆలయంలో ప్రారంభమైన జగన్నాథ రథోత్సవాలు

ద్వారకాతిరుమల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగన్నాథుని దివ్య రథచక్రాలు లక్ష్మీపురం ఆలయం నుంచి శ్రీవారి క్షేత్రం వైపునకు కదిలాయి. శుక్రవారం సాయంత్రం శోభాయమానంగా జరిగిన ఈ రథయాత్రను వీక్షించిన భక్తజనులు పరవశించారు. పురాతనమైన ఈ ఆలయం శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయంగా విరాజిల్లుతోంది. జగన్నాథుని రథోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమై వచ్చేనెల 6 వరకూ జరుగనున్నాయి. ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని, పరిసరాలను పుష్పమాలికలు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపతోరణాలతో సుందరీకరించారు.

రథయాత్ర సాగిందిలా..

అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ఒడిశా రాష్ట్రం పూరీ క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, సమేత జగన్నాథుని దారు విగ్రహాలను అట్టహాసంగా కోవెల నుంచి తెచ్చి రథంలో ఏర్పాటు చేసిన సింహాసనంపై ఉంచి అలంకరించారు. ఆలయ అధధికారుల పూజల అనంతరం బలిహరణ సమర్పించి రథయాత్రను ప్రారంభించారు. మేళతాళాలు, సన్నాయి డప్పు వాయిద్యాలు, అర్చకులు, కోలాట భజనల నడుమ జగన్నాథ రథయాత్ర ద్వారకా తిరుమల క్షేత్రానికి చేరుకుంది. ప్రతి ఇంటి ముందు స్వామివారికి భక్తులు హారతులు పట్టారు. క్షేత్రంలో తిరుగాడిన అనంతరం రథం తిరిగి లక్ష్మీపురం చేరుకుంది.




మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథుడు

మత్స్యావతారంలో జగన్నాథుడు

మత్స్యావతారంలో జగన్నాథుడు శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఏడాది పూరి క్షేత్రం నుంచి తెచ్చిన దారు విగ్రహాలను దశావతారాలుగా చేయడం ప్రధాన ఆకర్షణగా మారింది. లక్ష్మీపురం ఆలయంలో జగన్నాథస్వామి రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఇందులో భాగంగా తొలిరోజున మత్స్యావతారంలో శంఖు, చక్రాలను ధరించి, గదాధారియై సుభద్ర, బలభద్రులతో కలసి భక్తజనులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్లుగా చేసిన అలంకారం చూపరులకు కనువిందు చేసింది. ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వడాలిలో రథోత్సవం

ముదినేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారం వైభవంగా జరిగింది. సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర సుమారు 20 కిలోమీటర్ల దూరం సాగింది. భక్తుల జయ జయ ధ్వానాలు, మంగళ వాయిద్యాల మధ్య రథయాత్ర సాగింది. ముదినేపల్లి, పెయ్యేరు ఆటోనగర్, శ్రీహరిపురం, సింగరాయ పాలెం బావాజీ మఠం మీదుగా వడాలి చేరుకుంది.టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, ఎస్ఐ వీరభద్రరావు, అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు స్వామివార్లకు పూజలు జరిపారు. గరగ, కేరళ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.




రథయాత్రలో వేషధారణలు



బురద రోడ్డులో దిగబడిన పామాయిల్ లారీ

నాలుగు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం

టి.నర్సాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అప్పలరాజుగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తున్న ఆయిల్‌పామ్ గెలల లారీ శుక్రవారం రోడ్డుపై గోతుల్లో దిగబడింది. మలుపు కావడంతో ఈ లారీని తియ్యడానికి మరో పామాయిల్ లారీ వచ్చి అధి కూడా ఇరుక్కు పోయింది. దీంతో ఆ దారిలో పూర్తిగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నాలుగు గంటల పాటు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్థానికులు ఆయిల్‌పామ్ కంపెనీ వారు చొరవతో దిగబడిన లారిని తీసి రాకపోకలను పునరుద్ధరించారు.

రోడ్లు.. తూట్లు

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి.. గ్రామాల్లో రోడ్లు బురదమయంగా మారి వాహనాలు జారడంతో గాయాలపాలవుతున్నారు. కొన్ని రహదారులు పెద్దపెద్ద గోతులు పడి చెరువులను తలపిస్తున్నాయి..


అధ్వాన్నంగా తాడేపల్లిగూడెం గూడ్స్ షెడ్డు వంతెన

గోతులమయంగా గూడ్స్ షెడ్డు రోడ్డు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆ వంతెనకు ఎంతో చరిత్ర ఉంది. బ్రిటీష్ పరిపాలన హయాంలో నిర్మాణం చేసిన వంతెన ఇది. పట్టణంలో ఉన్న ప్రధాన వంతెనలలో ఇది కూడా ఒకటి. అటువంటి వంతెన నేడు ఆదరణకు నోచుకోకుండా శిథిలావస్థకు చేరుకుంది. తాడేపల్లిగూడెం పట్టణం నడి బొడ్డున ఉన్న గూడ్స్ షెడ్డు వంతెన ఎన్నో ఏళ్లుగా ప్రజల అవసరాలను తీరుస్తోంది. తొలుత ఈ వంతెన పైనుంచే గూడ్స్ షెడ్డుకు లోడ్ లారీలు వెళ్తుండేవి. కాలక్రమేణ ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెన పైనుంచి పెద్ద లారీలు వెళ్ళడం ప్రమాదకరమనిపైన బారికేడ్ వేశారు. లారీలు వెళ్లేందుకు అనుకూలంగా మరో వంతెన నిర్మించారు. ప్రస్తుతం ఈ వంతెనపై కార్లు, మోటర్ సైకిళ్ల మాత్రమే వెళ తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన మొత్తం గతుకులతో ఛిద్రమైంది. వంతెన మాత్రమే కాదు వంతెన దాటిన తరువాత వార్ఫు రోడ్డు మొత్తం అధ్వానంగా తయారైంది. వంతెన కింద పిచ్చిమొక్కలు పెరిగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణాలు సాగించే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలందరికి అవసరమైన వంతెన ప్రమాదకరంగా తయారవడంతో వాహనదారులు, వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వంతెన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


బురదమయంగా గొల్లలకోడేరు -మహదేవపట్నం రహదారి

ఈ దారిలో వెళితే జారి పడతారు..

పాలకోడేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గొల్లలకోడేరు- మహదేవపట్నం గ్రామానికి వెళ్ళే రహదారి బురదమయమై జారుడు బల్లలా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొల్లలకోడేరు గ్రామం మీద నుంచి మహదేవపట్నం, ఉండి వెళ్ళేందుకు ఇది ఎంతో అనువైన మార్గం. పంట పొలాల మధ్యలో నుంచి గొల్లలకోడేరు గ్రామం నుంచి మహదేవపట్నం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రహదారి ఉంది. ఈ రహదారికి గత ఐదు సంవత్సరాలుగా ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో గొల్లలకోడేరు పరిధిలో ఉన్న రహదారి పూర్తిగా పాడై పోయింది. గోతులు పడి బురదమయంగా మారింది. ఈ వేసవిలో మట్టి ట్రాక్టర్లతో ట్రాక్టర్ల ద్వారా, లారీలతో మట్టిని తోలుకెళ్ళడంతో రహదారిపై మట్టిబెడ్డలు పడి జారుడు బల్లలా తయారైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు జారిపడి గాయాలపాలయ్యారు. ఈ రహదారి వెంబడి పంట పొలాలతోపాటు సీతారామపురం, తమ్మగుంటపాలెం, తోడిగుల్లవారిపాలెం, గుబ్బలవారిపాలెంలలో ప్రజలు నివసిస్తారు. నిత్యం వారంతా ఈ రహదారి మార్గం మీదే ప్రయాణాలు సాగించాల్సి ఉంటుంది. గొల్లలకోడేరు ప్రాంత వాసులే కాకుండా ఉండి మండల ప్రజలు కూడా ఈ రోడ్డుకు మోక్షం కల్పించాలని కోరుతున్నారు.


దిప్పకాయలపాడు రాతిచెరువు వద్ద అధ్వానంగా ఉన్న రహదారి

ఈ రోడ్డుకు మోక్షం కలిగేనా..?

కొయ్యలగూడెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం నుంచి కన్నాపురం వెళ్తే రహదారి పూర్తిగా పాడై అధ్వానంగా తయారైంది. వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కన్నాపురం వరకు సుమారు 7 కిలోమీటర్లు మేర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.నాలుగు సంవత్సరాలుగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోవడం లేదు. కొయ్యలగూడెం నుంచి పోలవరం వెళ్లడానికి అదే విధంగా కేఆర్.పురం ఐటీడీఏకి వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. నిత్యం వేలాది వాహనాలు ఈ రహదారి గుండా వెళ్తాయి. ఈ రహదారి దుస్థితి పట్టించుకోవాలంటూ వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

దారి చూపించండి సారూ..!

బురద రోడ్డులో విద్యార్థుల అవస్థలు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పది గ్రామాలకు ఒకటే జూనియర్ కళాశాల. ఆ కళాశాలకు వెళ్లాలంటే పుంతరోడ్డే దిక్కు. ఆ రోడ్డులోనే విద్యార్థులు కళాశాలకు వెళ్లాల్సిన పరిస్థితి. గతంలోనూ ఇదే విధంగా విద్యార్థులు నకర యాతన అనుభవించారు. ప్రస్తుతం ప్రభుత్వం రోడ్లు వేస్తుంటంతో ఆ దారిని బాగుచేయాలని విద్యార్థులు వేడుకుంటున్నారు. ఆ దారిన వర్షం వస్తే వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. కళాశాలలో 70 మంది విద్యార్థులు చదువుతుంటే వర్షం వచ్చిన రోజు 30 మంది లోపే కళాశాలకు రావడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.


మాధవరం కళాశాలకు వెళ్లే దారి దుస్థితి


చెరువులా ఉన్న ఇటుకలకోట-పోలవరం ఏజెన్సీ రోడ్డు

చెరువుల్ని తలపిస్తున్న ఏజెన్సీ రోడ్లు

పోలవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో పోలవరం ఇటుకలకోట, గుంజవరం ఏజన్సీ గ్రామాల రోడ్లు వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై వర్షపు నీరు నిలవడం వల్ల ఎక్కడ గోతులున్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం వర్షాలకు తానాలకుంట కల్వర్టు కొట్టుకుపోగా ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారింది. గత ప్రభుత్వం గడిచిన నాలుగేళ్ళలో ఈ కల్వర్టు పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధి బుగ్గా మురళి తన సొంత ఖర్చులతో తాత్కాలికంగా రాక పోకలు సాగించేందుకు మార్గం వేశారు. ఇటీవల వర్షాలకు ఆ కల్వర్టు మళ్ళీ ప్రమాదకర స్థాయిలో కోతకు గురయ్యింది. కచేరి సెంటర్ నుంచి రేపల్లెవాడ జంక్షన్ వరకూ 9 కిలోమీటర్ల మేర రోడ్లు అస్తవ్యస్తంగా మారి ప్రజానీకం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో నిత్యం పోలవరం నుంచి బుట్టాయి గూడెం రాకపోకలు సాగించే ఆర్టీసి బస్సులు సైతం గోతుల్లో నిలిచి మొరాయిస్తున్నాయి. ఈ మార్గంలో పోలవరం నుంచి ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి, శింగన్నపల్లి, బోడిగూడెం, గార్లగొయ్యి, మామిడిగొంది, రామన్నపాలెం, కొత్తరామయ్యపేట గ్రామాల నుంచి జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కోట రామచంద్రపురం, బుట్టాయిగూడెం ప్రాంతాలకు చదువుల కోసం విద్యార్థులు, ఉద్యోగ విధుల నిర్వహణ కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు, రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అంతేగాక ఆ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాల బారినపడి గాయాలపాలవుతు న్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై రహదారులు భవనాలశాఖ డిప్యూటి ఇంజనీరు హరికృష్ణను వివరణ కోరగా పోల వరం కచేరి రోడ్డు నుంచి గుంజవరం వరకూ రోడ్ల నిర్మాణానికి, తానాలకుంట కల్వర్టు నిర్మాణానికి రూ.8 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక పంపామని నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.


చెరువును తలపిస్తున్న మూల్లంక -పెదలంక రహదారి

భారీ వర్షాలతో రహదారి ధ్వంసం

కలిదిండి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తుండటంతో మూల్లంక- పెదలంక ప్రధాన రహదారి సుమారు 7 కిలోమీటర్ల మేర పెద్ద గోతులు పడి ధ్వంసమైంది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.లోడు వాహనాలు రోడ్డుపై గోతుల్లో దిగబడుతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. బస్సులు, ఆటోలు సక్రమంగా రావడం లేదు. మూల్లంక పీహెచ్‌సీకి వెళ్లటానికి వృద్ధులు, గర్భిణులు,పిల్లల తల్లులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేయాలని విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..



విజయరాయిలో ఆందోళన చేస్తున్న కోకో రైతులు

కోకో గింజలు కొనుగోలు చేయాలి

గిట్టుబాటు ధర చెల్లించాలి.. రైతు సంఘం డిమాండ్

పెదవేగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రైతుల దగ్గర నిల్వ ఉన్న కోకో గింజలను పూర్తిగా కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని కోకో రైతు సంఘం విజ్ఞప్తి చేసింది. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా కోకో గింజలకు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. విజయరాయిలో శుక్రవారం కోకో రైతులు సమావేశమై కోకో గింజల కొనుగోలుపై నిరసన వ్యక్తంచేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో గింజల కొనుగోలు కంపెనీలు రైతుల దగ్గర నుంచి గింజలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు తీసుకోవడంలేదని, వచ్చేనెల 15 వరకు ప్రభుత్వం అందిస్తున్న రూ.50 ప్రోత్సాహకంతో కిలో రూ.500 చెల్లించి కొనుగోలు చేసేలా ఆయా సంస్థలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అనంతరం పెదవేగి పామాయిల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆయిల్‌పామ్ రైతులు చేస్తున్న పోరాటానికి కోకో రైతు సంఘం తరపున సంఘీభావం తెలిపారు. పామాయిల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని సంఘం విజ్ఞప్తి చేసింది. కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, విజయరాయి ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం నాయకుడు పాలడుగు నరసింహారావు, రైతులు గుడిబండి వీరారెడ్డి, కోనేరు సతీష్‌బాబు, రావర్ల తేజకృష్ణ, ఆలపాటి వాసు, వై.శ్రీనివాసరావు, బొప్పన మునీశ్వరరావు, బింగి శ్రీను, పావులూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోకో విక్రయ రైతులు దరఖాస్తు చేసుకోండి

ఏలూరు సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాయితీ ద్వారా కోకో విక్రయించే రైతులు ఈనెల 30లోగా ఉద్యాన శాఖకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.రామ్మోహన్ శుక్రవారం తెలిపారు. కేజీకి రూ.50 చొప్పున ప్రభుత్వ రాయితీతో కేజీ రూ.500 ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయిందన్నారు. కోకో రైతులు ఉద్యావన శాఖ వద్ద పేర్లను నమోదు చేసుకుంటే కంపెనీ వారికి విక్రయించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1536 మెట్రిక్ టన్నుల కోకో గింజలను మొండోలైజ్, డీపీ, చాకొలేట్, ఇతరుల ద్వారా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతులంతా ఈనెల 30లోపు రైతు సేవా కేంద్రాలలో పర్మిట్స్ తీసుకుని సమీపంలో గల కంపెనీలకు విక్రయించుకోవచ్చని ఉద్యావన శాఖాధికారి రామ్మోహన్ సూచించారు.


పుట్లగట్లగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే సర్వీసు రోడ్డు వద్ద రాస్తారోకో

గ్రీన్ ఫీల్డ్ హైవే నుంచి పొలాలకు దారివ్వాలి

» పుట్లగట్లగూడెం వద్ద రైతుల నిరసన

జంగారెడ్డిగూడెం,జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లగట్లగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పనులను శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. రహదారిపై టెంట్ వేసి రాస్తారోకో నిర్వహించారు. హైవే రోడ్డు పనులు పూర్తయిన తర్వాత పొలాలకు వెళ్లే రహదారి నిర్మించి ఇస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు దారి మూసివేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతులు దుక్కి దున్ని వరినాట్లు వేసే సమయం కావడంతో పొలాల్లోకి వెళ్లడానికి దారిలేక ఇబ్బందులు పడుతున్నట్లు మాజీ జడ్పీటీసీ, రైతు శీలం రామచంద్రరావు, వైసీపీ మండల అధ్యక్షుడు, రైతు వామిశెట్టి హరిబాబు తెలిపారు. గత మూడేళ్లుగా జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు వినతులు సమర్పిస్తున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. వరద నీరు, కొంగలచెరువు నుంచి వచ్చే వరద నీరు వెళ్లే దారి కూడా మూసివేయడంతో పంటలను ముంచి వేస్తున్నాయని రైతులు తెలిపారు. ఎంపీ పుట్టా మహేశ్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. రైతుల రాస్తారోకో కారణంగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో రైతులు గొల్లపూడి శ్రీనివాసరావు, శీలం వెంకటరాజు, బొచ్చు శ్రీను, పళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో

నిందితుడికి 20 ఏళ్ల జైలు

» ఏలూరు పోక్సో కోర్టు తీర్పు

ఏలూరు క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఏలూరులోని పోక్సో కోర్టు జడ్జి కె.వాణిశ్రీ శుక్రవారం రాత్రి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రాంతానికి చెందిన బాలిక (8)పై సుబ్బదేవిపేట కాలనీలో ఉండే షేక్ ఇబ్రహీం (45) లైంగిక దాడికి పాల్పడ్డాడు. మెడికల్ షాపు నిర్వహించే ఇబ్రహీం రోజు పాఠశాల నుంచి తిరిగి వెళ్లే బాలికకు తినుబండారాలు ఇచ్చి తరచుగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. రోజూ బాలిక ఆలస్యంగా రావడంతో నాయనమ్మ బాలికను ప్రశ్నించింది. ఇబ్రహీం ఎలా ప్రవర్తించాడో బాలిక చెప్పడంతో నాయనమ్మ 2024 ఫిబ్రవరి 10న జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి జంగారెడ్డిగూడెం ఎస్ఐ జి.జ్యోతిబస్ కేసు నమోదు చేయగా డీఎస్పీ ధనుంజయుడు కేసు దర్యాప్తు చేసి షేక్ ఇబ్రహీంను అరెస్టు చేశారు. ఈకేసు ఏలూరులోని పోక్సో కోర్టులో ఏడాదిన్నరలోనే విచారణకు వచ్చేలా పోలీసులు కృషి చేశారు. విచారణలో షేక్ ఇబ్రహీంపై నేరం రుజువు కావడంతో అతనికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. బాలికకు రూ.50 వేల పరిహారం అందించాలని జడ్జి వాణిశ్రీ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర శ్రీనివాస్ వాదించగా ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఎం.సుబ్బారావు, జంగారెడ్డిగూడెం సీఐ ఎంవి సుభాష్, ఎస్ఐ ఎస్‌కె జాబీర్, సిబ్బంది సహకరించారు. నిందితుడికి శిక్ష పడడంలో సహకరించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అభినందించారు.

30 నుంచి ప్రత్తిపాడు రైల్వే గేటు మూసివేత

పెంటపాడు / తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రత్తిపాడు నుంచి తాడేపల్లిగూడెం రూరల్ మండలం ఆరుగొలను వెళ్లే రైల్వే గేటు ఈ నెల 30న మూసివేయనున్నారు. మరమ్మతు పనులలో బాగంగా ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకూ ఐదురోజుల పాటు గేటును మూసివేస్తున్నట్లు తాడేపల్లిగూడెం రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్‌వీకే. వర్మ తెలిపారు.


ఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రభాకర్..క్షతగాత్రులతో మాట్లాడుతున్న పెదవేగి సీఐ

రాజీకి వెళితే చితక్కొట్టారు

దెందులూరు సమీపంలో దాబా దగ్గర ఘటన

బాధ్యులపై కఠిన చర్యలకు ఎమ్మెల్యే ఆదేశం

పెదవేగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : గత ఆదివారం జరిగిన వివాదంలో ముగ్గురు వ్యక్తులను కొట్టిన సంఘటనలో నిందితులు విద్యార్థులు కావడంతో పెద్దల చొరవతో వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఇరు వర్గాలు నిర్ణయించాయి. దీనికోసం శుక్రవారం ఉదయం నిందితులు తల్లిదండ్రులతో కలిసి దెందులూరు వెళ్లారు. ఆ సమయంలో దెందులూరుకు చెందిన కొంతమంది ఇద్దరు వ్యక్తులపై విచక్షణారహితంగా దాడిచేసి గాయపర్చారు. వివరాల్లోకి వెళ్తే యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెనుబోయిన మహేష్‌యాదవ్ గత ఆదివారం పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయం దగ్గర జరిగిన శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా రాయన్నపాలెం గ్రామానికి చెందిన కొంతమంది యువకులతో ఘర్షణ జరిగింది. దీంతో ఆ యువకులు రాయన్నపాలెం నుంచి కారును వెంబడించి విజయరాయిలో కారును అడ్డగించి కారును ధ్వంసం చేసి, కారులో ఉన్న మహేష్‌యాదవ్‌తో పాటు టీడీపీ మైనార్టీసెల్ జిల్లా నాయకుడు షేక్ జహీర్ అహ్మద్,కారు డ్రైవర్ చంద్రసూర్యలపై దాడిచేసి కొట్టారు. దీనిపై పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో బాధితులు అదేరోజు ఫిర్యాదు చేశారు. అయితే వివాదంలో ఉన్న యువకులు విద్యార్థులని, కేసు నమోదైతే వారి భవిష్యత్ పాడ వుతుందని వారి తల్లిదండ్రులు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి గురువారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దగ్గరకు వెళ్లి విజ్ఞప్తి చేశారు.మహేష్ యాదవ్‌కు క్షమాపణ చెప్పి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోమని వారికి చెప్పారు. అదే విషయాన్ని మహేష్ యాదవ్‌కు కూడా ఎమ్మెల్యే తెలిపారు. దీంతో రాయన్నపాలెం నుంచి ఈడా పవన్ సురేంద్ర, ఈడా భార్గవ్, మరికొంతమంది శుక్రవారం ఉదయం దెందులూరు వెళ్లారు. అదే అదనుగా మహేష్‌యాదవ్ వర్గీయులు భార్గవ్, పవన్ సురేంద్రలను చుట్టు ముట్టి రాడ్లు, కర్రలతో తీవ్రంగా గాయపర్చారు. అడ్డు వచ్చిన టీడీపీ నాయకులు మన్నే శ్రీనివాసరావు, బొద్దు నరేంద్రలను తోసివేసి మరీ దాడిచేశారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెంటనే సంఘటన జరిగిన దెందులూరులోని దాబా దగ్గరకు వెళ్లి క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారకులైన టీడీపీ నాయకుడు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌యాదవ్, అతని వర్గీయులపై కఠిన చర్యలు తీసుకోవాలని దెందులూరు ఎస్ఐ శివాజీని ఆదేశించారు. శాంతి చర్చలకు పిలిచి దాడిచేసి కొట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇలాంటి వాటిని ఉపేక్షించబోమని, సొంతపార్టీ నాయకులైనా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు పునరా వృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు సూచించారు. పెదవేగి సీఐ రాజశేఖర్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు కార్పొరేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సమావేశానికి మల్లేశ్వరరావు శుక్రవారం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాంగే, జిల్లా నాయకులు పి.కిషోర్‌లు మాట్లాడుతూ ఎస్క్రో అకౌంట్‌ను తక్షణమే తెరవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు వచ్చిన నేపథ్యంలో మీటర్ రీడర్స్‌కు విద్యుత్ శాఖలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి ఆదుకోవాలన్నారు. విద్యార్హతను బట్టి టెక్నికల్, నాన్ టెక్నికల్, షిఫ్ట్ ఆపరేటర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, మిగిలిన వారికి వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను కేటాయించాలన్నారు. రీడర్ల సమస్యలపై ఏఐటీయూసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తుందని చెప్పారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పి.జాకబ్‌లు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు, విద్యుత్ శాఖ అధికారులతో రీడర్స్ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.


జగదీశ్వరిని అభినందిస్తున్న రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాద్, ఎంపీ కేశినేని శివనాథ్

శాప్ సభ్యురాలిగా జగదీశ్వరి

పోలవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) సభ్యురాలుగా పోలవరం మండలానికి చెందిన టీడీపీ నాయకురాలు కొవ్వాసు జగదీశ్వరి శుక్రవారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో జగదీశ్వరిని క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌లు అభినందించారు.

క్రైం సమాచారం

మద్యం మత్తులో దాడి.. ఒకరి మృతి

లింగపాలెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి):మద్యం మత్తులో ఒక వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి చేయడంతో మృతి చెందిన ఘటన లింగపాలెం మండలంలో జరిగింది. ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న, స్థానికులు తెలిపిన వివరాలివి.. ఆసన్నగూడెంకు చెందిన తోకల శోభనాద్రి(85)ని అదే గ్రామానికి చెందిన మోదుగు సంజీవ రావు అనే వ్యక్తి మద్యం మత్తులో వెదురుకర్రతో బలంగా తలపై మూడుసార్లు కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు స్థానికుల సహకారంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సరదాగా కుటుంబంతో గడపాలని వచ్చి..

» ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం

నరసాపురం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సరదాగా కుటుంబ సభ్యులతో వారం రోజులు గడపాలన్న ఆశతో స్వగ్రామానికి వచ్చిన ఓ ఉద్యోగి ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి పడి దుర్మరణం చెందాడు. రుస్తుంబాద కొత్తకాలవ గట్టున ఈ విషాద ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. కొత్తపల్లి యజ్ఞఫణీంద్ర(29) గుజరాత్‌లో ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారిగా పని చేస్తున్నాడు. మూడు నెలల క్రితం వివాహం జరిగింది. ఈనెల 25న సెలవుపై రుస్తుంబాద వచ్చాడు. ఇంటిపై చెత్త, చెదారం పేరుకుపోవడంతో దాన్ని శుభ్రం చేసేందుకు బిల్డింగ్‌పైకి ఎక్కాడు. రెండు రోజులుగా వర్షం కురవడంతో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు, కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనిపై తండ్రి కొత్తపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని రూరల్ ఏఎస్ఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.

చికిత్స పొందుతూ ముగ్గురి మృతి

ఏలూరు క్రైం/పెంటపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వేర్వేరుచోట్ల పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ముగ్గురు మృతి చెందారు. వివరాలివి.. అనారోగ్యంతో బాధపడుతూ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని మహిళ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. కొంతకాలం నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలోనే ఉంటూ భిక్షాటన చేస్తూ జీవిస్తుంది. ఈనెల 25న ఆ మహిళ (50) అనారోగ్యానికి గురికావడంతో అత్యవసర విభాగం వైద్యులు డాక్టర్ జ్యోతి ఆసుపత్రి లో చేర్పించారు. చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది.

● రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలకు గురై మంగళగిరిలోని ఏఎంసీలో చికిత్స పొందుతున్న మహిళ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. కోరుకొల్లు గ్రామానికి చెందిన పర్వతాల అమ్మాజీ(48) ఆమె కుమారుడు శరణ్‌కుమార్ కలిసి మోటారు సైకిల్‌పై ఈనెల 7వ తేదీ ఉదయం కోరుకొల్లు నుంచి ద్వారకాతిరుమల వెళ్తున్నారు. మార్గమధ్యలో ఏలూరు రూరల్ మండలం మహేశ్వరపురం వద్ద కుక్క అడ్డురావడంతో ప్రమాదవశాత్తు మోటారు సైకిల్ కుక్కను ఢీకొనడంతో అదుపు తప్పి పడిపోయారు. అమ్మాజీ తలకు బలమైన గాయం కావడంతో తొలుత ఏలూరు ఆంధ్రా ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మంగళగిరిలోని ఏఎంసీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 26వ తేదీ అర్ధరాత్రి మృతి చెందింది. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

● తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీకి చెందిన మానుపాటి జయరాజు(40) చేపలు, రొయ్యల వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 21న పని నిమిత్తం తాడేపల్లిగూడెం నుంచి పరిమెళ్ల మీదుగా భీమవరం మోటర్‌సైకిల్‌పై వెళ్తుండంగా పరిమెళ్ల గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. తొలుత తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి, అనంతరం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ స్వామి తెలిపారు.


విపత్తుల సమయంలో సహాయ కార్యక్రమాలపై మాక్ డ్రిల్ నిర్వహిస్తోన్న ఎన్డీఆర్ఎఫ్, ఎన్‌సీసీ బృందాలు

విపత్తుల నిర్వహణపై ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ

ఏలూరు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ కేడెట్లకు ఏలూరు సీఆర్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తోన్న వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ , జాతీయ విపత్తు స్పందన దళం ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్, ప్రాక్టికల్ డెమో కార్యక్రమాలు జరిగాయి. భూకంపం, అగ్ని ప్రమాదాలు, వరదల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, బాధితులను సురక్షిత ప్రాంతాలకు చేర్చడంపై లైఫ్ బోట్, జెమినీ బోట్లపై డెమో ద్వారా ప్రదర్శనలు నిర్వహించారు. అత్యాధునిక పరికరాలతో సహాయ చర్యలు ఎలా చేపడతారో చూపించారు.ఇటువంటి శిక్షణతో కేడెట్లలో విపత్తులపై స్పందన, సహాయ కార్యక్రమాలపై అవగాహన ఏర్పడు తుందని, భవిష్యత్తులో ఇతరులకు కూడా మార్గనిర్దేశం చేయగల సామర్థ్యం పెరుగు తుందని క్యాంప్ కమాండెంట్ కల్నల్ విశ్వజిత్ శ్రీవాస్తవ అన్నారు. డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ తీర్థప్రసాద్, లెఫ్టినెంట్ ప్రేమ్‌సాగర్, కార్యాలయ సూపరింటెండెంట్ కొండయ్య, పీఐ స్టాఫ్ పాల్గొన్నారు.

పెనుమాకలంక పంచాయతీలో అవినీతి మాయాజాలం

లక్షల్లో సొమ్ము మాయం

వైసీపీ నాయకుడి ఘనకార్యం

సమాచార చట్టం నివేదికతో గుట్టు రట్టు

టీడీపీ నాయకుల ఆరోపణలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వెంకటరాజు

మండవల్లి జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు మత్స్యకారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ నేతల అండదండలతో వైసీపీ సర్పంచ్ పంచాయతీ నిధులను పక్కదారి పట్టించి జేబులు నింపుకుంటున్న వైనం వెలుగులోకి వచ్చింది. మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామంలో సర్పంచ్ ముంగర నాగరాజుపై విమర్శలు భగ్గుమన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో నేతల అండదండలతో అధికారులను మభ్యపెట్టి ప్రభుత్వ పంచాయతీ సొమ్ములను కాజేసినట్టు పెనుమాకలంక మాజీ సర్పంచ్‌లు ఘంటసాల శ్రీనివాసు, మరియమ్మ, గ్రామస్థులు వెంకటరాజు ఆరోపిస్తున్నారు. శుక్రవారం విలేకరులకు ఆ వివరాలను వెల్లడించారు. పంచాయతీలో జరుగుతున్న అవినీతి తంతుపై సమాచార హక్కు చట్టం ద్వారా జమా ఖర్చులపై నివేదిక అవినీతి గుట్టు రట్టు చేసింది. పంచాయతీలో వచ్చే నిధులతో పాటు కొల్లేరు గ్రామాల్లో ఉండే సమాంతర నిధులను సైతం వినియోగించుకుని కోట్ల అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు.దాదాపు కోటి రూపాయల వరకు ఖర్చు పెట్టగా అందులో భారీగా రూ.80 లక్షలు వరకు అవినీతి జరిగిందని తెలిపారు. సుమారుగా 2010లో చనిపోయిన ఆళ్ల వెంకటేశ్వరరావు 2021-22లో పంచాయతీ పోలింగ్ బూత్ వద్ద బ్లీచింగ్, శానిటేషన్ చల్లినట్టుగా కూలి చెల్లించడం, పీడీఎస్ రాష్ట్ర అధికారికి మామగారైన ఉలమా దావీదురాజు సైతం రక్షిత మంచినీటి పథక మరమ్మతులకు వచ్చినట్లు బిల్లు పెట్టుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మంచినీటి చెరువుకు విద్యుత్ మోటార్లు మూడు రోజులు వాడి నెల రోజులు 5 హెచ్‌పీ ఆయిల్ ఇంజన్లు వాడినట్లుగా లక్షలు బిల్లులు తీసుకున్నారని వివరించారు. పెనుమాకలంక పంచాయతీ రెండు వేల జనాభాతో మైనర్ పంచాయతీ అయినా ఆదాయం మెండుగానే ఉంటుంది. ఆర్థిక సంఘాల నిధులు నేరుగా పంచాయతీలకే జమకావడంతో పాటు చేపలచెరువుల వేలం పాటలు, పన్నులు రూపంలో ఏడాదికి రూ.25 లక్షలు వరకు నిధులు అందుబాటులో ఉంటాయి. దీన్ని అదునుగా చేసుకుని నాలుగేళ్ళ వ్యవధిలో రూ.80 లక్షలు వరకు దుర్వినియోగానికి పాల్పడినట్లు వారు వివరించారు. గ్రామం ద్వారా నిధులు తీసుకుని, పంచాయతీలో నిధులు బిల్లు పెట్టి డ్రా చేశారని తెలిపారు. గ్రామంలో జరిగిన అవినీతిపై సర్పంచ్, కార్యదర్శులపై జిల్లా కలెక్టర్‌కి సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు మాజీ సర్పంచ్‌లు తెలిపారు.

విషాదం మిగిల్చిన చేపల వేట



» నీటిగుండంలో మునిగి రెండు కుటుంబాల్లో ముగ్గురి మృతి

» వీరిలో ఇద్దరు అన్నదమ్ములు.. » కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

బుట్టాయగూడెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఇంటివద్ద ఖాళీగా ఉండే కంటే వాగుల వద్దకు చేపల వేటకు వెళితే ఇంటిలో కూర గడుస్తుంది అని వెళ్లిన ముగ్గురు గిరిజన యువకులు తెల్లం సీతారాముడు(30), తెల్లం కిషోర్(21), మడి దేవేంద్రకుమార్(18)లను విధి వక్రీకరించడంతో మృత్యువాత పడిన ఘటన చినరవ్వారిగూడెంలో జరిగింది. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం చినరవ్వారిగూడెంలో రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు యువకులు మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన సీతారాముడు, కిషోర్ అన్నదమ్ములు. శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు సీతారాముడు, దేవేంద్రకుమార్, కిషోర్, పండు, అరుణ్ అనే యువకులు చేపలు పట్టేందుకు దండిపూడి సమీపంలోని పోగొండ కొండవాగు దేవరగుండం వద్దకు వెళ్లారు. చేపలను పట్టే ప్రయత్నంలో ఒకరు గుండంలో పడిపోగా అతడిని కాపాడేందుకు మరో ఇద్దరు దిగగా లోతు ఎక్కువగా ఉండడంతో ఈత రాకపోవడంతో ముగ్గురూ మరణించారు. ఈ ఘటనను మరో ఇద్దరు యువకులు కుటుంబ సభ్యులకు తెలపడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఈతగాళ్ల చేత ముగ్గురు శవాలను బయటకు తీయించారు. మరణించినవారిలో తెల్లం సీతారాముడుకు వివాహం కాగా భార్య రజని, చిన్నపాప ఉన్నారు. తెల్లం కిషోర్ డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగం కోసం చూస్తున్నాడు. దేవేంద్రకుమార్ ఈ ఏడాది ఇంటర్ పూర్తిచేసి ఎంసెట్ రాసి కాలేజీలో సీటు కోసం ప్రయత్నం చేస్తున్నాడు. సీతారాముడు, కిషోర్ తల్లిదండ్రులు పోసిరావు, వీరాయమ్మ, భార్య రజనీలు, దేవేంద్రకుమార్ తల్లిదండ్రులు సోమయ్య, పోసమ్మ కుమారుడి కోసం విలపించడం అందరిని కంటనీరు పెట్టించింది. మృతదేహాలను


మృతదేహాల కోసం వెదుకుతున్న గజ ఈతగాళ్లు

పోస్టుమార్టం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

● ముగ్గురు గిరిజన యువకులు మృతి చెందడంపై రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతిని తెలిపారు. ప్రభుత్వపరంగా బాధిత కుటుంబాలకు సాయం చేస్తామని తెలిపారు.

కిల్లర్ సింహాద్రికి జీవిత ఖైదు

» ప్రసాదంలో సైనేడ్ కలిపి 20 నెలల్లో పది మంది హత్య


2019లో సింహాద్రిని అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న అప్పటి ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవల్ (ఇన్‌సెట్‌లో) సింహాద్రి (ఫైల్)

ఏలూరు క్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రసాదంలో సైనేడ్ కలిపి పది హత్యలు చేసిన కిల్లర్ సింహాద్రికి విజయవాడలోని ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో ఒక హత్యా కేసులో జీవిత ఖైదు విధించారు. అతడితో పాటు సహకరించిన షేక్ అమినుల్లాబాబుకు జీవిత ఖైదు విధిస్తూ జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు. ఏలూరు పత్తేబాదలోని ఒక అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా ఉండే వెల్లంకి సింహాద్రి అలియాస్ శివ(45) పదో తరగతి చదివాడు. ప్రస్తుతం ఏలూరు వెంకటాపురం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో ఉంటున్నాడు. తరచూ అతడి అపార్టుమెంట్‌కు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు రావడంతో వారి మాదిరిగా డబ్బు సంపాదించాలని ఆశపడ్డాడు. వారిలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆసరాగా చేసుకుని ప్రసాదం అంటూ ఆ ప్రసాదంలో సైనేడ్ కలిపి ఇచ్చి హతమార్చాడు. 20 నెలల్లో పది మందిని హతమార్చాడు.

ఏలూరులోని ఒక పీఈటీ టీచర్ కాటి నాగరాజు(49)ను సమీపంలోని వట్లూరు మేరీమాత స్తూపం వద్దకు 2019 అక్టోబరు 16న రప్పించి అక్కడ ప్రసాదం ఇవ్వడంతో అది తిని అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా నమోదు చేయగా అప్పటి ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవల్ ఆదేశాలతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. చివరకు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా సింహాద్రిని అరెస్టు చేశారు. ఈమేరకు అతడు చేసిన హత్యలు వెలుగులోకి వచ్చాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పేపర్‌మిల్లు వద్ద ఉంటున్న కొత్తపల్లి రాఘవమ్మ అనే వృద్ధురాలు బంధువు కావడంతో అతడి వద్దకు చుట్టం చూపుగా రావడంతో సైనేడ్ ఇచ్చి హతమార్చి లక్ష రూపాయలు నగదు, కొంత బంగారం అపహరించాడు. అదే జిల్లాలో బొమ్మూరులో ఉంటున్న అతడికి వరుసకు వదిన అయ్యే సామంతకుట్టి నాగమణిని ఇదే విధంగా హత్య చేసి ఐదు లక్షల నగదు, నగలతో పరారీ అయ్యాడు. ఏలూరులో తను అద్దెకు ఉంటున్న రాములమ్మ అనే ఆమెను కూడా సైనైడ్‌తో చంపివేశాడు. వెండి, బంగారు వస్తువులు అపహరించాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఒక స్వామీజీని ఆయుర్వేద మందు అంటూ సైనైడ్ ఇచ్చి హతమార్చాడు. చివరకు పోలీసులకు పట్టుబడడంతో 20నెలల్లో 10 హత్యలు చేసి 28 లక్షల 50 వేల రూపాయలు సంపాదించి ఏలూరులో ఒక ఇంటి స్థలం కొని ఇల్లు కట్టేసుకున్నాడు.

విజయవాడలో మోటారు వాహనాల విడిభాగాలకు నికిల్ కోటింగ్ వేసే షేక్ అమనుల్లా అలియాస్ బాబు, అలియాస్ శంకర్ (61)ని తనతో కలుపుకుని అతడి వద్ద నుంచి సైనేడ్ తెచ్చుకుని హత్యలకు పాల్పడడంతో అతడిని కూడా 2019 నవంబరు 5వ తేదీన ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ సింహాద్రి చేసిన పది హత్యలు గుర్తించి వాటిని అప్పటివరకూ అనుమానాస్పదంగా ఉన్నవాటిని హత్య కేసులుగా మార్పు చేసి అరెస్టు చూపించారు. ప్రస్తుతం ఈ కేసులు విచారణ సాగుతున్నాయి.

కృష్ణా జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామానికి చెందిన గండికోట భాస్కరరావుకు సైనేడ్ ప్రసాదం ఇచ్చి హతమార్చాడు. అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు విజయవాడలోని జిల్లా అదనపు సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. వెల్లంకి సింహాద్రి, షేక్ అమినుల్లాబాబులపై నేరం రుజువు కావడంతో వారిద్దరికి జీవిత ఖైదు, ఒకొక్కరికి రూ.25 వేల చొప్పున జరిమానా విధిస్తూ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి బి.అబ్రహం తీర్పు చెప్పారు. 2019లో సంచలనం సృష్టించిన సైనేడ్ సింహాద్రికి శుక్రవారం జీవిత ఖైదు పడడంతో మరోమారు ఏలూరులో చర్చించుకుంటున్నారు.

ఏపీ టీచర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలిగా ఆస్కార్ విజయ

ఏలూరు అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఏపీ టీచర్స్ యూనియన్ జిల్లాశాఖ గౌరవాధ్యక్షురాలిగా ఎస్.ఆస్కార్ విజయ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు శుక్రవారం నియామకపత్రాలను ఆమెకు అందజేశారు. చింతలపూడి మండలం సుప్రియన్‌పేట సీఎస్‌ఐ యూపీ స్కూలు హెచ్‌ఎంగా ఆమె పనిచేశారు. జిల్లాలో విద్యాభివృద్ధి, సంఘ బలోపేతానికి అందరినీ సమన్వయపర్చుకుని పనిచేయాలని సూచించారు.

పోలవరం పురుషోత్తపట్నం ఫెర్రీ బహిరంగ వేలం వాయిదా

పోలవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పోలవరం పురుషోత్తపట్నం ఫెర్రీ రేవు బహిరంగ వేలం వాయిదా వేసినట్లు ఎంపీడీ చెరుకూరి శ్రీనివాస్ బాబు శుక్రవారం తెలిపారు. జాయింట్ కమిటీ కోరం సభ్యులు హాజరు కాని కారణంగా బహిరంగవేలం వాయిదా వేయడం జరిగిందని, తదుపరి బహిరంగ వేలం వాయిదా తేదీని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రకటించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పది విద్యార్థులకు సూపర్ 50 సెక్షన్

బుట్టాయగూడెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో పదో తరగతి విద్యార్థులకు సూపర్ 50 పేరిట పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రత్యేక శిక్షణకు ఎంపికలు నిర్వహిస్తున్నారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకే అవకాశం ఉంటుందని ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ శుక్రవారం తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఐటీడీఏ పరిధిలో 10వ తరగతి బాల బాలికలకు ప్రత్యేక సెక్షన్లు నిర్వహించడానికి పీఎంఆర్‌సీ విభాగంలో పోటీ పరీక్ష నిర్వహించామన్నారు. 9వ తరగతిలో 450 మార్కులు పైబడినవారిని గుర్తించి సూపర్ 50 సెక్షన్‌కు ఎంపిక చేయడానికి ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వహణకు స్టేట్ అకడమిక్ మోటరింగ్ రాష్ట్ర పరిశీలకుడు కేఎస్ సాయికిశోర్ హాజరైనట్లు తెలిపారు. బ్యాచ్‌కు 50 మందిని ఎంపిక చేసి బాలికలకు కామయ్యకుంట ఆశ్రమ పాఠశాల, బాలురకు నూతిరామన్న పాలెం ఆశ్రమ పాఠశాలలో జూలై 1 నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. ప్రత్యేక బోధన సిబ్బందిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వారికి ప్రత్యేక శిక్షణతో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో డీడీ ఎన్.శ్రీవిద్య, ఏఎంవో కె.శిరమయ్య, సీఎంవో శ్రీనివాసరావు, జీసీడీవో రాజేశ్వరి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో రక్షిత నీరందించాలి


దోసపాడులో తాగునీటిని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీహరి

చెరువులు పరిశీలించిన అధికారులు

దెందులూరు జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలని జడ్పీ సీఈవో ఎం శ్రీహరి అన్నారు. కొవ్వలి గ్రామంలోని మంచినీటి పైలెట్ ప్రాజెక్టును తాగునీటి సరఫర విభాగం ఉప కార్యనిర్వహణ ఇంజనీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చింతమనేని వర్మతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, తాగునీటి సరఫర విభాగం అధికారులకు పలు సూచనలు చేశారు. దోసపాడు గ్రామంలోని మంచినీటి చెరువును అధికారులు పరిశీలించి తాగునీరు పరీక్ష చేయించారు. పైపులైన్లు తనిఖీ చేశారు. ఎంపీడీవో భీమరాజు, పంచాయతీ కార్యదర్శి, అధికారులు ఉన్నారు.

నీటి బకాయిల వసూళ్లు వేగవంతం చేయాలి

పెదపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామాల పరిధిలోని రైతుల నుంచి నీటి బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని ఆర్డీవో అంబరీష్ వీఆర్వోలను ఆదేశించారు. పెదపాడు తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటి స్థలాలు, రేషన్ కార్డు లు, నీటి బకాయిలు, కౌలురైతు కార్డులపై సిబ్బందితో సమీక్షించారు. ఆర్డీవో అంబరీష్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది నిర్ణీత వేళల ప్రకారం ఎల్లప్పుడూ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కొత్తముప్పర్రు 22ఏ ఫైల్స్, గోగుంట ఇంటి స్థలంపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణజ్యోతి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.


వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అంబరీష్



తూర్పు యడవల్లి రామాలయంలో
కల్యాణ మహోత్సవం

కామవరపుకోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ దత్తత ఆలయమైన తూర్పు యడవల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఆషాఢ విదియ పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీతారాములకు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

వారాహి నవరాత్రి మహోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని అంబికాదేవి, సౌభాగ్య లక్ష్మీదేవి అమ్మవార్ల ఆలయాల వద్ద వారాహి నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, భక్తులతో పూజలు, కుంకుమార్చనలు, పారాయణ నిర్వహిస్తున్నారు. అంబికాదేవి ఆలయ అర్చకుడు వారణాసి రాఘవేంద్రశర్మ శుక్రవారం శ్రీచక్ర కుంకుమార్చన భక్తులతో జరిపించారు. సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయంలో వారాహిదేవి ఉపాసకులు తమ్మిరాజు వికాస్ శర్మ, అర్చకుడు ఊటుకూరి నాగేశ్వరశర్మ పూజలను జరిపించారు.

● పోలవరం: కొత్తరామయ్యపేటలో వారాహిదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పోలవరం, ఇటుకలకోట, కొత్తరామయ్యపేట, కొత్తదేవరగొంది, ఎన్టీఆర్, కాలనీ బోడిగూడెం, వింజరం గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. గారపాటి హరికృష్ణ దంపతులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


మునిసిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె నోటీసు

జంగారెడ్డిగూడెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో ఇంజనీరింగ్, మంచినీటి సరఫరా విభాగం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, జేఏసీ ఆధ్వర్యంలో జూలైలో సమ్మె చేపట్టనున్నట్లు మునిసిపల్ కమిషనర్ కేవీ.రమణకు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఇంజనీరింగ్ విభాగ పట్టణ అధ్యక్షుడు కంతేటి షణ్ముఖరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న టెక్నికల్ కార్మికులకు నెలకు రూ.29,200 వేతనం ఇవ్వాలని, నాన్ టెక్నికల్ కార్మికులకు నెలకు రూ.24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు సంక్షేమ పథకాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎ.ముత్యాలరావు, డి.నాగరాజు, కె.లక్ష్మణరావు, ఎం.అప్పలస్వామి, డి.నాగరాజు, ఎం.బాలు, రమేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.


గాలాయగూడెం దళితవాడ రోడ్లు పరిశీలిస్తున్న చింతమనేని ప్రభాకర్

పారిశుధ్యం మెరుగుదలకు ప్రాధాన్యం

దెందులూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం మెరుగుదలకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గాలాయగూడెం దళితవాడలో రోడ్లు, డ్రెయిన్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఇటీవల గాలివానకు తాడి చెట్టు పడి ఇల్లు పాడై గాయాలపాలైన పెండ్లి ఇస్సాక్‌ను తహసీల్దార్ సుమతితో కలిసి పరామర్శించారు. బియ్యం, నిత్యవసర సరుకులను బాధితుడికి చింతమనేని అందజేశారు. ఆయన వెంట ఏఎంసీ డైరెక్టర్ మద్దాల దయానంద రాజు, పూజారి శ్రీను, ఏనుగు రామ కృష్ణ, మాగంటి మిల్లుబాబు, మోతు కూరి నాని, పూజారి వెంకటరత్నం నాయుడు, దోరేపల్లి రమేష్, రాజశేఖర్, బోడేటి మోహన్‌బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన కెమిస్టులు

పెదవేగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపే కెమిస్టులు (మందుల దుకాణదారులు) అంకిత భావంతో సేవలందించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరు రూరల్ ఏరియా కెమిస్టు, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం చింతమనేని ప్రభాకర్‌ను కలిసి అసోసియేషన్ భవన నిర్మాణానికి అనువుగా స్థలం ఇప్పించాలని కోరారు.

నట్టల నివారణ మందు పంపిణీ

గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ప్రభుత్వం ఏటా నట్టల నివారణ మందు ఉచితంగా పంపిణీ చేస్తుందని ఆయన చెప్పారు. పశుసంవర్ధక శాఖాధికారులు ప్రతి గ్రామానికి వచ్చి నట్టల నివారణ మందును జీవాలకు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


హెలెన్ కెల్లర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

దివ్యాంగులకు చేయూతనందించాలి

ఏలూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు చేయూత అందించాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ బి.శ్రీరాంకుమార్ అన్నారు. దొండపాడులోని పరివర్తన్ బధిరుల పాఠశాల, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సంయుక్తంగా ఆధ్వర్యంలో శుక్రవారం హెలెన్ కెల్లర్ జయంతి నిర్వహించారు. రామ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. హెలెన్ కెల్లర్ జీవితం, ఆమె సాధించిన విజయాలు, దివ్యాంగుల హక్కుల కోసం ఆమె అసాధ్యాలను సుసాధ్యం చేయగల మానవ సంకల్పానికి ప్రతీక అన్నారు. పరివర్తన్ బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల దివ్యాంగ పిల్లలకు నాణ్యమైన విద్యనందిస్తూ వారిని స్వాలంబన దిశగా ముందుకు సాగుతోందన్నారు. పాఠశాల సిబ్బంది, డీడీఆర్‌సీ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బాలరాజును కలిసిన మలేరియా అధికారులు

ఐటీడీఏ పరిధిలో మలేరియా కార్యాలయం ఏర్పాటుపై హర్షం

జీలుగుమిల్లి, జూన్ 27: (ఆంధ్రజ్యోతి): ఏలూరులో ఉన్న మలేరియా జిల్లా కార్యాలయాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చొరవతో ఐటీడీఏ పరిధిలోకి తీసుకురావడంతో గిరిజన ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తామని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మలేరియా అధికారులు ఎమ్మెల్యేను శుక్రవారం కలిశారు. ఇక్కడ మలేరియా కార్యాలయాన్ని గత ప్రభుత్వం అశ్రద్ధ వల్ల ఏలూరుకు తరలించారు. తిరిగి ఇక్కడ ఏర్పాటు చేయడంపై గిరిజన సంఘాల ప్రతినిధులు సైతం మలేరియా జ్వరాల నివారణ చర్యలపై హర్షం వ్యక్తం చేశారు. ఎంపీహెచ్ఇవో పి.శ్రీనివాసరావు, బుట్టాయగూడెం సబ్ యూనిట్ ఆఫీసర్ నరేష్ బాబు, హెల్త్‌అసిస్టెంట్ ప్రసాద్, వెంకటేష్ ఉన్నారు.


పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న రెడ్డి అప్పలనాయుడు

జనసేనలోకి వైసీపీ కార్యకర్తలు

ఏలూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శనివారపుపేట ప్రాంతానికి 30 మందికి పైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేనలో చేరారు. జనసేన నాయకుడు దేవరపల్లి రత్నబాబు ఆధ్వర్యంలో ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు సమక్షంలో పార్టీలో శుక్రవారం చేరారు. సామాన్య కార్యకర్తలకూ గుర్తింపు లభించే జనసేనలో చేరికలు రోజు రోజుకు పెరుగుతున్నాయని అప్పలనాయుడు అన్నారు. డివిజన్ ఇన్‌చార్జి దోనేపూడి లోవరాజు, కొనికి మహేష్, వాసా సాయి, షేక్ ఖాసీం, పలువురు మహిళా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కట్లయ్య

రజకుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రజకుల సమస్యలు పరిష్కరించాలిన సంఘం జిల్లా అధ్యక్షుడు కట్లయ్య అన్నారు. రజక వృత్తి నిర్వహణకు ఉచిత కరెంటు తదితర అంశాలతో ప్రభుత్వం జీవోలు విడుదల చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వలన అమలు కావడం లేదన్నారు. రజక జన సంఘ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లాలోని 909 గ్రామాలలో కొన్ని చోట్ల మాత్రమే గ్రామ పంచాయితీలు మంచినీటి కనెక్షన్ ద్వారా చెరువులకు నీరు అందిస్తున్నారని చెప్పారు. ఉచిత విద్యుత్ కనెక్షన్లపై విద్యుత్ అధికారులు చొరవ చూపాలని కోరారు. అనంతరం చేబ్రోలు గ్రామ రజక జనసంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చీపురుపల్లి అప్పారావు, ఉపాధ్యక్షులుగా మానాజు రమణ, సెక్రటరీగా ఎండమూర్ శ్రీనివాసులు, కోశాధికారిగా ఉద్దాల శ్రీనివాసుతో పాటు మరో ముగ్గురు కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా రజక నేతలు వట్లూరు మురళి, వి.శ్రీనివాస్, కదిలి సుబ్బయ్య, లక్ష్మీప్రసన్న, యలమంచిలి నాగశేషు, తదితరులు పాల్గొన్నారు.

అర్చకత్వం భగవంతుని వరం

ఏలూరు టూటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అర్చకత్వం దైవ సంబంధమైన మహత్కార్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. లోక క్షేమాన్ని కాంక్షించే గురుతర బాధ్యత అర్చకులపై ఉందన్నారు. తూర్పు వీధి శ్రీరామమందిర ఎమ్మెల్యే చంటి, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డిఅప్పలనాయుడు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్.శ్రీనివాసచక్రవర్తికి ఆలయ అర్చకులుగా నియామకపత్రం అందజేశారు. ఆలయ ఈవో రాధ పాల్గొన్నారు.

మొహరం వేడుకలు ప్రారంభం

ఏలూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కుండీసెంటర్లోని గొలుసుల పంజా హజరత్ మౌలా ఆలీ ముష్కిర్‌కుషా ఆస్థానాల్లో మొహరం వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. హజరత్ ఇమామేహసన్, హజరత్ ఇమామే హుస్సేన్ త్యాగాలను స్మరించుకుంటూ పీర్ల చావిడిలో పీర్లను అలంకరించి జెండా ఆవిష్కరించారు. ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. కార్యక్రమంలో ముజావర్లు, గాలీబ్ ఆలీ పర్యవేక్షించారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

జన సేవాదళ్ కార్యకర్తల ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న వసంతరావు

చింతలపూడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జన సేవాదళ్ కార్యకర్తలు ఉన్నత విలువలు కలిగి ఉండాలని జిల్లా సీపీఐ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. చింతలపూడిలో జరిగే సీపీఐ జిల్లా మహాసభల జయప్రదం చేయడానికి చింతలపూడిలో జనసేవాదళ్ సభ్యులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. సేవాదళ్ సభ్యులు ప్రకృతి విపత్తుల సమయంలో దేశ ప్రజల రక్షణ కోసం సేవలు అందించాలని, శ్రమదానం చేయాలన్నారు. మహాసభలు జయప్రదంగా జరిగే విధంగా కృషి చేయాలన్నారు. సేవాదళ్ సభ్యులతో కొత్త బస్టాండ్ నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఎం.వసంతరావు, కంచర్ల గురవయ్య, టి.బాబు, తదితరులు పాల్గొన్నారు.

5న సీపీఐ నిరసన

కామవరపుకోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ జూలై 5న జరిగే నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా సమితి సభ్యుడు టీవీఎస్.రాజు తెలిపారు. ప్రభుత్వం పెంచిన చార్జీలను తగ్గించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల ముందు ప్రజలపై ఎటువంటి భారాన్ని మోపబోమని చెప్పి ఇప్పుడు విద్యుత్ చార్జీల పేరుతో ధర పెంచడం తగదన్నారు. ఆయన వెంట కంకిపాటి బుచ్చిబాబు, జి.దుర్గారావు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపరచాలి

లింగపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్య మెరుగుపరచాలని డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి అన్నారు. ధర్మాజీగూడెం, బోగోలు గ్రామాలలో శుక్రవారం ఆమె పర్యటించారు. వర్షాకాలం పంచాయితీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలలో చెత్త, మురుగునీరు నిలవకుండా చూడాలని సూచించారు. మురుగునీటి కాలువలను పూడిక తీయించాలని, ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించేలా వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలని క్లోరినేషన్ చేయించాలన్నారు. అనంతరం గ్రామాలలో చెత్త ద్వారా సంపద సృష్టి కేంద్రాలను పరిశీలించారు. ప్రజల తడి చెత్త - పొడి చెత్త వేరు చేసి చెత్త వాహనాలలో వేసేలా గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్‌తో కించపరిచే పోస్టులు

» మహిళా ఉద్యోగినికి వేధింపులు

కుక్కునూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా మహిళా ఉద్యోగినిని తీవ్ర మానసిక వేదనకు గురిచేసిన వ్యక్తిని కుక్కునూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుక్కునూరుకు చెందిన మహిళ సచివాలయంలో ఉద్యోగం చేస్తోంది. ఆమె పేరుతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ అకౌంట్స్ సృష్టించి, పలు రకాల కించపరిచే పోస్టులు పెట్టేవాడు. ఈ పోస్టులను సహ ఉద్యోగులు, మిత్రులు చూసి ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అకౌంట్ తనది కాదని గుర్తించి భర్త ఎం.సాయికుమార్ సహకారంతో జిల్లా సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించి, ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు. ఇదంతా చేస్తున్నది కుక్కునూరు మండలం దాచారం గ్రామానికి చెందిన ధార చినరాజుగా గుర్తించారు. కుక్కునూరు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు.


విద్యార్థి మిత్ర కిట్‌లను అందుకున్న విద్యార్థులు

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి

పెదపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలని అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయ ఛైర్మన్ వేమూరి శ్రీనివాసరావు అన్నారు. అప్పనవీడు హైస్కూల్ విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్‌లను శుక్రవారం అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ తీసుకుని తగు చర్యలు తీసుకుంటుందని, ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో వడ్డి వాసవి, గరికిపాటి చంటి, బెక్కం లక్ష్మీనారాయణ, హెచ్.ఎం. తోట పుష్పవతి, పేరెంట్ కమిటీ ఛైర్మన్ మోగంటి లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: ప్రభుత్వం పాఠశాల బలోపేతానికి చర్యలు తీసుకుందని టీడీపీ గోపన్నపాలెం అధ్యక్షుడు చింతా సుబ్బారావు, మారగాని సత్యనారాయణ అన్నారు. గోపన్నపాలెం ప్రభుత్వ పాఠశాలలో విద్యామిత్ర కిట్‌లను కొండేటి హనుమంతుతో కలిసి శుక్రవారం అందజేశారు. అందరూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చదివిద్దామని ఏనుగు కేబుల్ శ్రీను, బజారు గణేష్, బొర్ర చందు, భవాని ప్రసాద్, చమ్మలమూడి రాములు, సుబ్బారావు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంస్థాగత ఫైట్ !

(5వ పేజీ తరువాయి)

నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి కార్యకర్తలను సముదాయించడంతో అభిప్రాయసేకరణ కొనసాగించారు. ప్రతీ పంచాయతీలో గ్రూపులుగా ఉన్న నాయకులు తమ వర్గానికి చెందిన నాయకుడినే పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని ప్రయత్నించడంతో అక్కడ వాతారణం పంచాయతీ ఎన్నికలను తలపించింది. బండివారిగూడెం, బంధంచర్ల, కేతవరం పంచాయతీలు తప్ప మిగిలిన 12 పంచాయతీల్లో అభిప్రాయసేకరణ పూర్తయినట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యకర్తల అభిప్రాయాలను పరిశీలించి కమిటీలను నిర్ణయిస్తారని నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారావు గౌడ్, మాజీ జడ్పీటీసీ నండూరి వెంకటచలపతి రావు, ఆచంట సూర్యనారా యణ, బొంతు సత్యనారాయణ, తోట లక్ష్మీ నారాయణ, పిన్నమనేని మధు, పెద్దిన సత్యనారాయణ, గండబోయిన శ్రీను, కాల్నీడి రాంబాబు, కొల్లి బ్రదర్స్, జోనుబోయిన సోంబాబు, రామ్మోహనరావు, కాసన్నేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మంచిరోజులొచ్చాయ్!

కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడం వల్ల టీచర్లు ఇక్కడకు వస్తారు. వారికి రూ.11,500 వేతనం లభిస్తుంది. దీంతో పాటు అన్ని సెంటర్లకు హెల్పర్లు నియామకం జరుగుతుంది. వారికి ఏడువేల వేతనం ఇస్తారు. ఇప్పటి వరకు ఒక్కరే పనిచేసే హెల్పర్ లేదా టీచర్‌పై పని ఒత్తిడి తగ్గనుంది. జిల్లాలో 1,959 ప్రధాన సెంటర్లుండగా, ఇప్పుడు తాజాగా 266 మినీ కేంద్రాలుగా అప్ గ్రేడ్ కావడంతో దీంతో జిల్లాలో మొత్తం 2,225 కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా ఉండనున్నాయి.

పీజీ టెస్టులో నారాయణపురం విద్యార్థులకు ర్యాంకులు

ఉంగుటూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పీజీ ప్రవేశ పరీక్షలలో ర్యాంకులు సాధించారు. ఫిజిక్స్‌లో శీతాల లిఖిత రాణి స్టేట్ 21వ ర్యాంకు, ఎం.శ్రీనివాస్ 155వ ర్యాంకును, మ్యాథ్స్‌లో ముత్యం చందు, జువాలజీలో కుక్కల దేవి 311వ ర్యాంకును సాధించారు. ప్రిన్సిపాల్ టీకే.విశ్వేశ్వరరావు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఆధార్ మొబైల్ కేంద్రాలు

నిడమర్రు జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చేరే విద్యార్థుల కోసం గ్రామాలలో ప్రత్యేక ఆధార్ మొబైల్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. నిడమర్రు, భువనపల్లిలో ఆధార్ కేంద్రాల నమోదు ప్రక్రియను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆధార్ నమోదులో సమస్యలను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. చంటి పిల్లల ఆధార్ నమోదుకు సిబ్బంది సహకరించారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన

ఏలూరు అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వల్ల దుష్ప్రభావాలు, నష్టాలు, తదితర అంశాలపై శుక్రవారం ఏఆర్‌డీజీకే మునిసిపల్ హైస్కూలులో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూలు హెచ్‌ఎం, టూటౌన్ పోలీసులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లుగా మాజీ సైనికులకు అవకాశం

చింతలపూడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో పారా లీగల్ వలంటీర్లుగా పని చేయడానికి ఆసక్తి ఉన్న మాజీ సైనికులు దరఖాస్తు చేయాలని న్యాయాధికారి సీహెచ్.మధుబాబు తెలిపారు. సమాజ సేవ చేయాలనే ఆసక్తి ఉన్న మాజీ సైనికులు బయోడేటా దరఖాస్తులో వివరించి అందజేయాలన్నారు. కోర్టు పరిధిలో ఉన్న నాలుగు మండలాల్లోని వారు మాత్రమే అర్హులన్నారు. ఇతర వివరాలకు 6304323271లో వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఈనెల 29వ తేదీలోగా ఆసక్తి గల వారు దరఖాస్తులు చేయాలని కోరారు.

మానవత కార్యవర్గం


చింతలపూడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి మండల శాఖ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. మండలంలోని మద్దిమత్తెనగూడెం గ్రామంలో జరిగిన శాఖ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా యడ్లపల్లి శ్రీను, ఉపాధ్యక్షుడిగా మన్యం సత్యకుమార్, కోశాధికారిగా జల్లిపల్లి విశ్వేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా ఎం. అప్పారావు, జి.వేమారెడ్డి, తాటిపర్తి శ్రీను, కె.సురేంద్ర ఎన్నికయ్యారు. కె.రాజేశ్వరి, దేవినేని భాస్కర్, ఆర్.గంగాధర్, ఎ.అప్పారావు, గౌరవ అధ్యక్షులు ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా వసంతవాడ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని వాహన, చెరువు యజమానులపై, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు.

కార్మికులకు సేఫ్టీ షూస్

జంగారెడ్డిగూడెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ మంచినీటి సరఫరా విభాగంలో 36 మంది కార్మికులకు ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి శుక్రవారం సేఫ్టీ షూస్, టార్చ్ లైటు పంపిణీ చేశారు. సుమారు రూ.50వేలు సాధారణ నిధులతో సేఫ్టీ షూస్, టార్చ్ లైట్లు పంపిణీ చేశామని ఛైర్‌పర్సన్ నాగలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కేవీ.రమణ, కౌన్సిలర్లు చిటికెల అచ్యుత రామయ్య, ఏవీ.రమణ మూర్తి, బత్తిన చిన్న, ఏఈ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


కేడీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాల పరిశుభ్రతతో
వ్యాధులు దూరం
జిల్లాలో పలుచోట్ల అవగాహన ర్యాలీలు

ఏలూరు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు అరికట్టాలంటే ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, చాటపర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ చంద్ర అన్నారు. చాటపర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కోటేశ్వర దుర్గాపురంలో శుక్రవారం డ్రైడే డ్రైడే, మలేరియా నివారణ మాసోత్సవ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాతావరణంలో మార్పులతో జ్వరాలు, ఇతర అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు దోమల నిర్మూలన చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి రామాంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త పావని, ఎంఎల్‌హెచ్‌పి జాహ్నవి, ఆశా కార్యకర్తలు, భాస్కరమ్మ, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

● ఉంగుటూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా యూనిట్ తాడేపల్లిగూడెం ఆరోగ్య ఉప అధికారి వైవీ.లక్ష్మణరావు సూచించారు. పూళ్ల పీహెచ్‌సీ పరిధిలోని కైకరంలో శుక్రవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. అన్ని ప్రాంతాలలో నిల్వ నీరు తొలగించడం ద్వారా మలేరియా రహిత సమాజాన్ని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కె.శ్రీనివాసరావు, కార్యకర్త వెంకటేశ్వరమ్మ, జయశ్రీ, విజయశ్రీ, ఆశాలు జయలక్ష్మి, నాగమణి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


కైకరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

● నిడమర్రు జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పరిసరాలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో విజయకుమారి అన్నారు. భువనపల్లిలో పారిశుధ్య పనులను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. గ్రామ సర్పంచ్ కిలారి సత్యవతి, పంచాయితీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనధికారికంగా విక్రయిస్తున్న వరి విత్తనాలు స్వాధీనం

చాట్రాయి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సోమవరం గ్రామంలో కలవల వెంకటేశ్వర్లు ఇంటి వద్ద అనధికారికంగా విక్రయిస్తున్న 40 బస్తాల వరి విత్తనాలను శుక్రవారం రాత్రి విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఏవో మీరయ్య, తహసీల్దార్ కన్యాకుమారి, చాట్రాయి ఏవో శివశంకర్ మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న వరివిత్తనాల విలువ రూ.54 వేలు ఉంటుందని, అతడిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలిదిండి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వర్షాల దృష్ట్యా జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. పీహెచ్‌సీల్లో ఉచితంగా రక్త పరీక్షలు చేస్తున్నామని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచరాదన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేడి పదార్థాలను తినాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే పీహెచ్‌సీకి వస్తే రక్త పరీక్ష చేసి ఉచితంగా మందులు అందిస్తామన్నారు.



చెరువును తలపిస్తున్న మూల్లంక - పెదలంక రహదారి

భారీ వర్షాలతో రహదారి ధ్వంసం

కలిదిండి, జూన్ 27(ఆంధ్రజ్యోతి):ఐదు రోజులుగా భారీవర్షాలు కురుస్తుండడంతో మూల్లంక-పెదలంక ప్రధాన రహదారి సుమారు ఏడు కిలోమీటర్ల మేర పెద్దగోతులు పడి ధ్వంసమైంది. వాహనదారులు పలు అవస్థలు పడుతున్నారు. తవుడు లోడు వాహనాలు రోడ్డుపై గోతుల్లో దిగబడుతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ద్విచక్ర వాహనచోదకులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. ఈ రహదారిపై ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. బస్సులు, ఆటోలు సక్రమంగా రావడం లేదు. పెదలంక నుంచి మూల్లంకలో పీహెచ్‌సీకి వెళ్లేందుకు వృద్ధులు, గర్భిణులు, చంటి పిల్లల తల్లులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేయాలని పాలకులకు అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మూల్లంక-పెదలంక ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి చేస్తా : మంత్రి పార్థసారథి



క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలలో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు గెలుపునకు విశేష కృషి చేసిన నూజివీడు విక్టోరియా టౌన్ హాల్ (వీటీహెచ్) క్రీడాకారులను ఆయన అభినందించి మాట్లాడారు. ముసునూరు మండలం రమణక్క పేటలో సిమెంట్ బాస్కెట్ బాల్ కోర్టు ఏర్పాటుకు, వీటీహెచ్ క్రీడాకారులు ప్రాక్టీస్ అయ్యేందుకు 200 బాస్కెట్ బాల్‌లు శాప్ అధికారితో మాట్లాడి క్రీడాకారులకు డేబోర్డర్ స్కీంలను అందించేందుకు చర్యలు చేపడతానన్నారు. వీటీహెచ్ కోచ్ వాకా నాగరాజు, వనజ, ఎస్.లక్ష్మి, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'పెనుమాకలంక'లో అవినీతి మాయాజాలం

రూ.లక్షల్లో సొమ్ము మాయం
వైసీపీ నాయకుడి ఘనకార్యం
టీడీపీ నాయకుల ఆరోపణలు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వెంకటరాజు

మండవల్లి జూన్ 27(ఆంధ్రజ్యోతి): కొల్లేరు మత్స్యకారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ నేతల అండదండలతో వైసీపీ సర్పంచ్ పంచాయతీ నిధులను పక్కదారి పట్టించి జేబులు నింపుకుంటున్న వైనం వెలుగులోకి వచ్చింది. మండవల్లి మండలం పెను మాకలంక గ్రామంలో సర్పంచ్ ముంగర నాగరాజుపై విమర్శలు భగ్గుమన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో నేతల అండదండలతో అధికారు లను మభ్యపెట్టి ప్రభుత్వ పంచాయతీ సొమ్ములను కాజేసినట్టు పెనుమాకలంక మాజీ సర్పంచ్‌లు ఘంటసాల శ్రీనివాసు, మరియమ్మ, గ్రామస్థులు వెంకటరాజు ఆరోపిస్తు న్నారు. శుక్రవారం విలేకరులకు ఆ వివరా లను వెల్లడించారు. పంచాయతీలో జరు గుతున్న అవినీతి తంతుపై సమాచార హక్కు చట్టం ద్వారా జమా ఖర్చులపై నివేదిక అవి నీతి గుట్టు రట్టు చేసింది. పంచాయతీలో వచ్చే నిధులతో పాటు కొల్లేరు గ్రామాల్లో ఉండే సమాంతర నిధులను సైతం వినియో గించుకుని కోట్ల అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు.దాదాపు కోటి రూపాయల వరకు ఖర్చు పెట్టగా అందులో భారీగా రూ.80 లక్షలు వరకు అవినీతి జరిగిందని తెలిపారు. సుమారుగా 2010లో చనిపోయిన ఆళ్ల వెంక టేశ్వరరావు 2021-22లో పంచాయతీ పోలింగ్ బూత్ వద్ద బ్లీచింగ్, శానిటేషన్ చల్లినట్టుగా కూలి చెల్లించడం, పీడీఎస్ రాష్ట్ర అధికారికి మామగారైన ఉలమా దావీదురాజు సైతం రక్షిత మంచినీటి పథక మరమ్మతులకు వచ్చి నట్లు బిల్లు పెట్టుకోవడం ఆశ్చర్యంగా ఉంద న్నారు. మంచినీటి చెరువుకు విద్యుత్ మోటార్లు మూడు రోజులు వాడి నెల రోజులు 5 హెచ్‌పీ ఆయిల్ ఇంజన్లు వాడినట్లుగా లక్షలు బిల్లులు తీసుకున్నారని వివరించారు. పెనుమాకలంక పంచాయతీ రెండు వేల జనాభాతో మైనర్ పంచాయతీ అయినా ఆదాయం మెండుగానే ఉంటుంది. ఆర్థిక సంఘాల నిధులు నేరుగా పంచాయతీలకే జమకా వడంతో పాటు చేపలచెరువుల వేలం పాటలు, పన్నులు రూపంలో ఏడాదికి రూ.25 లక్షలు వరకు నిధులు అందుబాటులో ఉంటాయి. దీన్ని అదునుగా చేసుకుని నాలుగేళ్ళ వ్యవధిలో రూ.80 లక్షలు వరకు దుర్విని యోగానికి పాల్ప డినట్లు వారు వివరించారు. గ్రామం ద్వారా నిధులు తీసుకుని, పంచాయతీలో నిధులు బిల్లు పెట్టి డ్రా చేశారని తెలిపారు. గ్రామంలో జరిగిన అవినీతిపై సర్పంచ్, కార్యదర్శులపై జిల్లా కలెక్టర్‌కి సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు మాజీ సర్పంచ్‌లు తెలిపారు.

మంచిరోజులొచ్చాయ్!

(5వ పేజీ తరువాయి)

కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడం వల్ల టీచర్లు ఇక్కడకు వస్తారు. వారికి రూ.11,500 వేతనం లభిస్తుంది. దీంతో పాటు అన్ని సెంటర్లకు హెల్పర్ల నియామకం జరుగుతుంది. వారికి ఏడువేల వేతనం ఇస్తారు. ఇప్పటి వరకు ఒక్కరే పనిచేసే హెల్పర్ లేదా టీచర్‌పై పని ఒత్తిడి తగ్గనుంది. జిల్లాలో 1,959 ప్రధాన సెంటర్లుండగా, ఇప్పుడు తాజాగా 266 మినీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ కావడంతో జిల్లాలో మొత్తం 2,225 కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా ఉండనున్నాయి.

సంస్థాగత ఫైట్ !

(5వ పేజీ తరువాయి)

నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి కార్యకర్తలను సముదాయించడంతో అభిప్రాయసేకరణ కొనసాగించారు. ప్రతీ పంచాయతీలో గ్రూపులుగా ఉన్న నాయకులు తమ వర్గానికి చెందిన నాయకుడినే పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని ప్రయత్నించడంతో అక్కడ వాతారణం పంచాయతీ ఎన్నికలను తలపించింది. బండివారిగూడెం, బంధంచర్ల, కేతవరం పంచాయతీలు తప్ప మిగిలిన 12 పంచాయతీల్లో అభిప్రాయసేకరణ పూర్తయినట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యకర్తల అభిప్రాయాలను పరిశీలించి కమిటీలను నిర్ణయిస్తారని నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారావుగౌడ్, మాజీ జడ్పీటీసీ నండూరి వెంకటచలపతి రావు, ఆచంట సూర్యనారాయణ, బొంతు సత్యనారాయణ, తోట లక్ష్మీనారాయణ, పిన్నమనేని మధు, పెద్దిన సత్యనారాయణ, గండబోయిన శ్రీను, కాల్నీడి రాంబాబు, కొల్లి బ్రదర్స్, జోనుబోయిన సోంబాబు, రామ్మోహనరావు, కాసన్నేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



ముదినేపల్లి వడాలిలో జగన్నాథస్వామి రథానికి పూజలు.. కేరళ కళాకారుల వేషధారణలు

వైభవంగా జగన్నాథస్వామి రథయాత్ర

» ఆకట్టుకున్న కేరళ వేషధారణ గరగ నృత్యాలు » సాంస్కృతిక ప్రదర్శనలతో కోలాహలం

ముదినేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారం వైభవంగా జరిగింది. చినపూరిగా పేరుగాంచిన వడాలి గ్రామంలో ఉన్న సుభద్ర బలరామ సహిత జగన్నాథ స్వామి దేవస్థానం నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర సుమారు 20 కిలోమీటర్ల దూరం సాగింది. దేవస్థానం వద్ద వందలాది మంది భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాల మధ్య దేవస్థానం మాజీ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, ఎస్‌ఐ వీరభద్రరావు, అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు స్వామివార్లకు పూజలు జరిపి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఈ రథయాత్ర ముదినేపల్లి, పెయ్యేరు ఆటోనగర్, శ్రీహరిపురం, సింగరాయపాలెం బావాజీ మఠం వరకు కొనసాగి వడాలి చేరుకుంది. చేవూరు, కాకరవాడ, స్తంభం చెరువు, చేవూరుపాలెం గ్రామాల నుంచి భక్తులు వచ్చి రథయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేరళ కళాకారుల వేషధారణలతో గరగ, నృత్య ప్రదర్శనలు, బ్యాండు కళాకారుల వాయిద్యాలు నిర్వహించారు.



కైకలూరు ఇస్కాన్ రథయాత్రలో భక్తులు.. (ఇన్‌సెట్‌లో) రాధాకృష్ణులు

ఘనంగా ఇస్కాన్ రథయాత్ర

కైకలూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాధాకృష్ణ మందిర్ (ఇస్కాన్) రథయాత్రను కైకలూరులో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కైకలూరు పురవీధుల్లో ఇస్కాన్ ఆధ్వర్యంలో రథయాత్ర నిర్వహించారు. వేలాదిమంది భక్తులు తాడుతో రథాన్ని ముందుకు లాగుతూ భక్తిని చాటారు. పలువురు చేసిన నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. వికాస తరంగిణి సభ్యులు కోలాట ప్రదర్శన చేశారు. కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లోని రాధాకృష్ణ మందిర్ ఆధ్వర్యంలో రథయాత్రను నిర్వహించారు. రథయాత్రను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయం వద్ద ముగింపు చేశారు.



గంగానమ్మకు సారె సమర్పణ

నూజివీడు టౌన్ : జంగాలపేట పాత శివాలయం లోని గంగానమ్మకు మహిళలు ఆషాఢ మాస సారెను సమర్పించారు. మేళతాళాలు మధ్య ఆషాఢ సారెతో మహిళలు ఊరేగింపుగా ఆషాఢ సారెను సమర్పించారు.



రఘుబాబుకు టీడీపీ నాయకుల అభినందనలు

టీడీపీ ముసునూరు మండల అధ్యక్షుడిగా రఘుబాబు

ముసునూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ముసునూరు మండల అధ్యక్షుడిగా గుడిపాడు గ్రామానికి చెందిన గద్దె రఘుబాబు ఎన్నికయ్యారని భీమవరం ఏఎంసీ చైర్మన్, పరిశీలకుడు శేషగిరి తెలిపారు. నూజివీడు పార్టీ కార్యాలయంలో పరిశీకులు శేషగిరి, శ్రీనివాసరావు, వాసు ఆధ్వర్యంలో గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, సర్పంచ్‌లతో ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో 29మంది పాల్గొనగా, గద్దె రఘుబాబుకు 23 ఓట్లు వచ్చాయని పరిశీలకులు తెలిపారు. రఘుబాబుకు ముసునూరు టీడీపీ నాయకులతోపాటు పలు గ్రామాల నాయకులు, సర్పంచ్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

చాట్రాయి మండలంలో ఇజ్జిగాని, తేళ్లూరి..



ఇజ్జిగాని వెంకటేశ్వరరావు తేళ్లూరి శేఖర్

చాట్రాయి : చాట్రాయి మండల టీడీపీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఇజ్జిగాని వెంకటేశ్వరరావు(ఆరుగొలనుపేట), తేళ్లూరి శేఖర్(బూరుగుగూడెం) ఎన్నికైనట్లు పార్టీ పరిశీలకులు లావేటి శ్రీనివాసరావు, వాసు ప్రకటించారు. నూజివీడు టీడీపీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా మొక్కపాటి మురళీ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా తమ్మిశెట్టి లక్షణరావు, చిన్నం నాగ మల్లేశ్వర రావు, బూబత్తుల చెన్నారావు, కార్యదర్శులుగా గుళ్ళపల్లి కృష్ణయ్య, బూబత్తుల మధుసూదనరావు, బలుసు పవన్‌కుమార్, ట్రెజరర్‌గా ఎలికా వెంకటేశ్వరరావు ఎన్నికైనట్టు ప్రకటించారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

లబ్ధిదారుల అంగీకారంతో పోలీస్‌స్టేషన్ నిర్మాణం

మండవల్లి జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండవల్లి తరుగుమూల వద్ద అఖిలపక్ష నాయకులు, గ్రామస్థులు ఆమోదం, ఇళ్లస్థలాల లబ్ధిదారుల అంగీకారంతో పోలీసుస్టేషన్ నిర్మాణం జరుగుతుందని కూటమి నాయకులు గుడివాడ చిట్టిబాబు తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం కూటమి నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. తరుగుమూల వద్ద స్థలాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పరిశీలించి పోలీసు స్టేషన్ నిర్మాణానికి అనువుగా ఉందని ఆమోదించారని తెలిపారు. లబ్ధిదారులు ఇళ్లపట్టాలపై తహసీల్దార్‌తో మాట్లాడామని, త్వరలో వారికి పట్టాలు అందజేస్తామని తహసీల్దార్ చెప్పినట్లు వివరించారు. పోలీసుస్టేషన్ నిర్మాణానికి ఎటువంటి అభ్యంతరం లేదని.. కొందరు తమను తప్పుదోవ పట్టించారని పోరాట కమిటీ నాయకుడు బుద్ధుల రాముడు పేర్కొనడం విశేషం. సమావేశంలో నాయకులు గుడివాడ బాలాజీ, యార్లగడ్డ శంకర్, మెండా సురేష్, నల్లా వెంకటేశ్వరరావు, గుడివాడ గణేష్, గుడివాడ మురళీ, దూసనపూడి నాంచారయ్య, అడపా జానీ, శివయ్య, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహాల రగడ

నూజివీడు టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం పాత రావిచర్ల గ్రామంలో విగ్రహాల విషయంలో నెలకొన్న వివాదం బహిరంగ వాగ్వాదానికి దారి తీసిన ఘటన శుక్రవారం జరిగింది. గ్రామంలోని లైబ్రరీ వద్ద శ్రీకృష్ణుడు, విఘ్నేశ్వరుడు, అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేయడంతో వివాదం నెలకొంది. విగ్రహాల ఏర్పాటు వర్గ పోరుగా మారి గ్రామంలోని ప్రధాన రహదారిలో తీవ్ర వాగ్వాదానికి దారి తీసింది. ఎవరికి వారే తాము ఏర్పాటు చేసిన విగ్రహం కచ్చితంగా ఉండాలంటూ వాదన వినిపించారు. గతంలో ఈ ప్రాంతంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు టీవీ ద్వారా విజ్ఞానాన్ని గ్రామస్థులకు అందించే విధంగా ఏర్పాటు చేశారు. అనంతరం ఈ గ్రంథాలయం పాలకేంద్రంగా మారింది. బస్సుల కోసం మహిళలు వేసి ఉండాల్సి వస్తోందని నీడ కోసం విశ్రాంతి భవనంగా మార్చగా ఇక్కడ మూడు విగ్రహాలను ఏర్పాటు చేయడం వివాదానికి దారి తీసింది. గ్రామ పెద్దలు ఎంతగా సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ విగ్రహాలను ఏర్పాటు చేసిన వారు వినకుండా తమ వాదన ప్రకారం కొనసాగాలంటూ గట్టిగా పట్టుపట్టారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నూజివీడు రూరల్ ఎస్‌ఐ జ్యోతిబసు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణం ప్రశాంతంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నుల వితరణ

ఆగిరిపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం సర్నాల గూడెం ప్రాథమిక పాఠశాలకు విజయవాడకు చెందిన వేద చారిటబుల్ సేవా ట్రస్టు చైర్మన్ యడ్లపాటి శిరీషరాణి, జనరల్ సెక్రటరీ డాక్టర్ యడ్లపాటి శేషసాయి పాఠశాలను సందర్శించి నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అధిక మొత్తంలో అందజేశామన్నారు. అనంతరం హెచ్‌ఎం జ్ఞానసుందరంను శాలువాతో సత్కరించారు. విద్యా కమిటీ చైర్మన్ పి.బీను, గ్రామస్థులు పాల్గొన్నారు.



టీడీపీ మండల కమిటీ ఎన్నికల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

వాడివేడిగా కైకలూరు టీడీపీ మండల కమిటీ ఎన్నిక

» పోటీలో ఐదుగురు అభ్యర్థులు

కైకలూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కైకలూరు టీడీపీ మండల కమిటీ ఎన్నిక వాడివేడిగా జరిగింది. శుక్రవారం కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో మండల కమిటీ ఎన్నికను నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారా వు అధ్యక్షతన నిర్వహించారు. పోటీలో అభ్యర్థులు ఎక్కువమంది ఉండడంతో కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది. ఎన్నికల పరిశీలకులుగా వచ్చిన జగ్గవరపు ముత్తారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు మెంటే పార్థసారథి, పెద్దిబోయిన శివప్రసాద్, కోళ్ళ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అభ్యర్థుల పేర్లను ప్రతిపాదించమని సూచనలు చేశారు. పోటీదారులు ఎక్కువగా ఉండడంతో ఎన్నిక నిర్వహించారు. ప్రత్యేక రూమ్‌లో విడివిడిగా గ్రామపార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బూత్ కన్వీనర్ల వారికి నచ్చిన అభ్యర్థి పేరును సూచించారు. వారు సూచించిన విధంగా జాబితా తయారు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడి పదవి కోసం పంది రాధాకృష్ణ, కేకే బాబు, బూరుబోయిన శ్రీనివాసరావు, ఎండీ జానీ, బోడావుల ఎలీషారావు పోటీ పడ్డారు. మండల ప్రధాన కార్యదర్శి పదవి కోసం వీరాబత్తిన సుధా, కంచర్ల రామకృష్ణ, నాగనబోయిన నాంచారయ్య, ఓగిరాల శ్రీకాంత్, చెక్కా పూర్ణచంద్రరావు, ఆలూరి రాజేష్‌కు మార్ పోటీ పడ్డారు. వీరి ఎన్నికను రహస్యంగా సేకరించిన పరిశీలకులు రాష్ట్రపార్టీకి పంపించనున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ డైరెక్టర్‌లు కొడాలి వినోద్, పీజేఎస్ మాల్యాద్రి, పెన్మెత్స త్రినాధరాజు, బీకేఎం నాని, వడ్డీసాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి పూల రామచంద్రరావు, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, గంగుల శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్రాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

నూజివీడు టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావిధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. నూజివీడు నియోజకవర్గం సీపీఐ 25వ మహాసభ కామ్రేడ్ బత్తుల వెంకటేశ్వర ప్రాంగణంలో కమ్యూనిస్టు నాయకులు రాయంకుల లక్ష్మణరావు, ఈవీ శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగిస్తున్నది ఎర్ర జెండా మాత్రమే అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకటరామారావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెడితే కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా ప్రజలకు చేసింది ఏమి లేదని విమర్శించారు. సీపీఐ నియోజకవర్గ నాయకులు నిమ్మగడ్డ నరసింహ, పట్టణ కార్యదర్శి సీహెచ్ పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

'డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం'

ఆగిరిపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని సీడీపీవో పి.విజయకుమారి అన్నారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 'నాషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బాలబాలికలకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కువగా మాదక ద్రవ్యాలు వినియోగించే వారిలో 10 నుంచి 17 ఏళ్ల వయసు గలవారు ఉన్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే వ్యాధులపై అవగాహన కల్పించారు. మన దేశాన్ని మాదక ద్రవ్య రహిత దేశంగా మార్చడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.రాగమయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి

మండవల్లి జూన్ 27(ఆంధ్రజ్యోతి): బడి ఈడు గల బాలబాలికలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తోడ్పాటునందించాలని సర్పంచ్ బోనం శేషగిరి తెలిపారు. మండలంలోని అయ్యవారిరుద్రవరం హరిజనవాడ(బీపీఎస్) పాఠశాలలో హెచ్‌ఎం సీహెచ్ పిచ్చేడు ఆధ్వర్యంలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టూడెంట్ కిట్‌ను శుక్రవారం ఆయన అందజేశారు. ప్రభుత్వం చేపడుతున్న ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఎంపీటీసీ శ్రీకృష్ణ యాదవ్ కోరారు.

నాణ్యమైన విద్యకు ప్రభుత్వం కృషి

ముసునూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకల సదుపాయాలను కల్పించి, నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ సీనియర్ నాయకుడు దేవినేని వరప్రసాదరావు, నియోజకవర్గ తెలుగుయువత కార్యాదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి) అన్నారు. శుక్రవారం ముసునూరు జడ్పీ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను వారు పంపిణీ చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ నక్కా యోహాను, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

ముసునూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బెల్ట్‌షాపులపై నూజివీడు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో చెక్కపల్లికి చెందిన మన్యం నాగదుర్గారావును అదుపులోకి తీసుకుని, ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని, పోతనపల్లికి చెందిన బానవతు స్వామానాయక్‌ను అదుపులోకి తీసుకుని, 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపా రు. మద్యం బాటిళ్లపై ప్రభుత్వం ముద్రించిన స్టిక్కర్లు మినహా ఇతర స్టిక్కర్లు అనధికారికంగా ఉంచడం నేరమని, వీటిపై సమాచారం ఉంటే తమకు తెలపాలని సీఐ కోరారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసే షాపులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కిల్లర్ సింహాద్రికి జీవిత ఖైదు

» ప్రసాదంలో సైనేడ్ కలిపి 20 నెలల్లో పది మంది హత్య



2019లో సింహాద్రిని అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న అప్పటి ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవల్ (ఇన్‌సెట్‌లో) సింహాద్రి (ఫైల్)

ఏలూరు క్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రసాదంలో సైనేడ్ కలిపి పది హత్యలు చేసిన కిల్లర్ సింహాద్రికి విజయవాడలోని ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో ఒక హత్యా కేసులో జీవిత ఖైదు విధించారు. అతడితో పాటు సహకరించిన షేక్ అమినుల్లాబాబుకు జీవిత ఖైదు విధిస్తూ జడ్జి శుక్రవారం తీర్పు చెప్పారు. ఏలూరు పత్తేబాదలోని ఒక అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా ఉండే వెల్లంకి సింహాద్రి అలియాస్ శివ(45) పదో తరగతి చదివాడు. ప్రస్తుతం ఏలూరు వెంకటాపురం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో ఉంటున్నాడు. తరచూ అతడి అపార్టుమెంట్‌కు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు రావడంతో వారి మాదిరిగా డబ్బు సంపాదిం చాలని ఆశపడ్డాడు. వారిలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆసరాగా చేసుకుని ప్రసాదం అంటూ ఆ ప్రసాదంలో సైనేడ్ కలిపి ఇచ్చి హతమార్చాడు. 20 నెలల్లో పది మందిని హతమార్చాడు.

ఏలూరులోని ఒక పీఈటీ టీచర్ కాటి నాగరాజు(49)ను సమీపంలోని వట్లూరు మేరీమాత స్తూపం వద్దకు 2019 అక్టోబరు 16న రప్పించి అక్కడ ప్రసాదం ఇవ్వడంతో అది తిని అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా నమోదు చేయగా అప్పటి ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవల్ ఆదేశాలతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. చివరకు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా సింహాద్రిని అరెస్టు చేశారు. ఈమేరకు అతడు చేసిన హత్యలు వెలుగులోకి వచ్చాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పేపర్‌మిల్లు వద్ద ఉంటున్న కొత్తపల్లి రాఘవమ్మ అనే వృద్ధురాలు బంధువు కావడంతో అతడి వద్దకు చుట్టం చూపుగా రావడంతో సైనేడ్ ఇచ్చి హతమార్చి లక్ష రూపాయలు నగదు, కొంత బంగారం అపహరించాడు. అదే జిల్లాలో బొమ్మూరులో ఉంటున్న అతడికి వరుసకు వదిన అయ్యే సామంతకుర్తి నాగమణిని ఇదే విధంగా హత్య చేసి ఐదు లక్షల నగదు, నగలతో పరారీ అయ్యాడు. ఏలూరులో తను అద్దెకు ఉంటున్న రాములమ్మ అనే ఆమెను కూడా సైనైడ్‌తో చంపివేశాడు. వెండి, బంగారు వస్తువులు అపహరించాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఒక స్వామీజీని ఆయుర్వేద మందు అంటూ సైనైడ్ ఇచ్చి హతమార్చాడు. చివరకు పోలీసులకు పట్టుబడడంతో 20నెలల్లో 10 హత్యలు చేసి 28 లక్షల 50 వేల రూపాయలు సంపాదించి ఏలూరులో ఒక ఇంటి స్థలం కొని ఇల్లు కట్టేసుకున్నాడు.

విజయవాడలో మోటారు వాహనాల విడిభాగాలకు నికిల్ కోటింగ్ వేసే షేక్ అమనుల్లా అలియాస్ బాబు, అలియాస్ శంకర్ (61)ని తనతో కలుపుకుని అతడి వద్ద నుంచి సైనేడ్ తెచ్చుకుని హత్యలకు పాల్పడడంతో అతడిని కూడా 2019 నవంబరు 5వ తేదీన ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ సింహాద్రి చేసిన పది హత్యలు గుర్తించి వాటిని అప్పటివరకూ అనుమానాస్పదంగా ఉన్నవాటిని హత్య కేసులుగా మార్పు చేసి అరెస్టు చూపించారు. ప్రస్తుతం ఈ కేసులు విచారణ సాగుతున్నాయి.

కృష్ణా జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామానికి చెందిన గండికోట భాస్కరరావుకు సైనేడ్ ప్రసాదం ఇచ్చి హతమార్చాడు. అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు విజయవాడలోని జిల్లా అదనపు సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. వెల్లంకి సింహాద్రి, షేక్ అమినుల్లాబాబులపై నేరం రుజువు కావడంతో వారిద్దరికి జీవిత ఖైదు, ఒకొక్కరికి రూ.25 వేల చొప్పున జరిమానా విధిస్తూ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి బి.అబ్రహం తీర్పు చెప్పారు. 2019లో సంచలనం సృష్టించిన సైనేడ్ సింహాద్రికి శుక్రవారం జీవిత ఖైదు పడడంతో మరోమారు ఏలూరులో చర్చించుకుంటున్నారు.